## వాయుసేనలో ప్రైవేటు భాగస్వామ్యం తప్పనిసరి

న్యూఢిల్లీ : భారత వాయుసేన సామర్థ్యం పెంపునకు ప్రైవేటు భాగస్వామ్యాన్ని తీసుకోక తప్పదని ఉన్నత స్థాయి కమిటీ అభిప్రా యపడింది. స్వల్పకాలిక, దీర్ఘకాలిక చర్యల్లో భాగంగా ప్రైవేటు సంస్థల సహకారం తీసుకొని లోటుపాట్లను సరిదిద్దుకో వాల్సి ఉందని తెలిపింది. సకాలంలో యుద్ధ విమానాలు అందక ఇబ్బందులు ఎదురవుతున్నట్టు సాక్షాత్తూ వాయుసేన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్ బహిరంగంగా చెప్పిన నేపథ్యంలో కమిటీ చేసిన ఈ సూచనకు ప్రాధాన్యం ఏర్పడింది. రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలోని సాధికారిక కమిటీ రక్షణ మంత్రికి అందజేసిన నివేదికలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రస్తావించింది. యుద్ధ విమానాల తయారీ, ఇతర అంశాల్లో ప్రైవేటు భాగస్వామ్యం తీసుకోవాలని ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సు చేసింది.

RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 247 బుధవారం 1 అక్టోబర్ 2025 పేజీలు : 4 వెల : రూ. 2.00



## ట్యాంక్ బండ్ వద్ద ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

హైదరాబాద్: బతుకమ్మ వేడుకల ముగింపు కార్యక్రమం హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై ఘనంగా జరిగింది. అమర వీరుల స్మారకం నుంచి ట్యాంక్ బండ్ వద్ద బతుకమ్మ ఘాట్ వరకు దాదాపు 700 బతుకమ్మలతో మహిళలు ప్రదర్శన నిర్వహించారు. మంత్రి కొండా సురేఖ, టూరిజం కార్పొరేషన్ ఎండీ క్రాంతి, సంగీత నాటక అకాడమీ ఛైర్మన్ అలేఖ్య పుంజాల, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారధ, హైదరాబాద్ కలెక్టర్ హరి చందన, సాంస్కృతిక సారథి ఛైర్‌పర్సన్ విమలక్క, డిప్యూటీ మేయర్ శ్రీలత తదితరులు.. బతుకమ్మ పాటలకు మహిళలతో కలిసి నృత్యం చేశారు. పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు. వేడుకల్లో భాగంగా సచివాలయంపై 3డీ మ్యాప్ లేజర్ షో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ... బతుకమ్మ వేడుకలకు గిన్నిస్ రికార్డులు వచ్చేలా ప్రభుత్వం కృషి చేసిందన్నారు. "కొంతమంది గతంలో బతుకమ్మ వేడుకల్లో డిస్కో డ్యాన్సలు ఆడేవాళ్లు. డిస్కో డ్యాన్సల సంప్రదాయం ఇప్పుడు లేదు. పూర్వీకులు మనకు అందించిన సంప్రదాయాలను కొనసాగిద్దాం" అని పేర్కొన్నారు.



## సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన యువ క్రికెటర్ తిలక్ వర్మ



హైదరాబాద్: ఆసియా కప్ ఫైనల్‌లో పాక్‌పై అద్భుతంగా ఆడి భారత్‌ను గెలిపించిన యువ క్రికెటర్ తిలక్ వర్మ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. జూబ్లీ హిల్స్‌లోని నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన తిలక్‌ను.. సీఎం సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తిలక్ వర్మ క్రికెట్ బ్యాట్‌ను బహూకరించారు. మంత్రి వాకిటి శ్రీహరి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి, ఎండీ సోనీ బాలాదేవి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.




## శబరిమల అయ్యప్ప స్వామి భక్తులకు శుభవార్త

శబరిమల వంటి ప్రసిద్ధ దేవాలయం ఎప్పుడు రద్దీగా ఉంటుంది. ముఖ్యంగా కార్తీక మాసం, మండల దీక్ష సమయంలో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. అయితే, శబరిమల ఆలయానికి నేరుగా వెళ్లలేని భక్తుల కోసం ట్రావెన్కోర్ దేవస్వం బోర్డు గుడ్ న్యూస్ చెప్పింది. త్వరలో ఆన్‌లైన్‌లో ప్రసాదం బుక్ చేసుకునే సౌకర్యం అందుబాటులోకి తెస్తున్నట్లు ప్రకటించింది. భక్తులు తమ ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా స్వామివారి ప్రసాదాలు బుక్ చేసుకునే సదుపాయాన్ని మరో నెలలో ప్రారంభించనుంది. ట్రావెన్కోర్ దేవస్వం బోర్డు నూతనంగా కౌంటర్ బిల్లింగ్ మాడ్యూల్ ద్వారా అందుబాటులోకి తెస్తోంది. ఈ కొత్త సదుపాయంతో శబరిమల ఆలయంతో పాటు ట్రావెన్కోర్ దేవస్వం పరిధిలోని 1252 ఆలయాల ప్రసాదాలు కూడా భక్తులు ఆన్‌లైన్ ద్వారా తమ ఇంటి నుంచే బుక్ చేసుకోవచ్చు. ఈ సౌకర్యం ముఖ్యంగా శబరిమల వంటి రద్దీగా ఉండే ఆలయాలకు నేరుగా వెళ్లలేని భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ట్రావెన్కోర్ దేవస్వం బోర్డు అధ్యక్షుడు తెలిపారు.




# హీటెక్కిస్తోందిగా..!

## డైలమాలో స్థానిక సంస్థల ఎన్నికలు..

## న్యాయస్థానం నిర్ణయంపై సస్పెన్స్!!

హైదరాబాద్ : ఒక అడుగు ముందుకు..రెండు అడుగులు వెనక్కు. ఏడాదిగా స్థానిక సమరం తెలంగాణలో హీటెక్కిస్తోంది. ఎప్పుడు రేపోమాపో ఎన్నికలన్నట్లుగానే డెవలప్‌మెంట్స్ కనిపిస్తూ వస్తున్నాయ్. కానీ ఈ సారి ఇంకా డిఫరెంట్ సినారియో ఉంది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ..2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఓ వైపు రిజర్వేషన్ల పెంపు అంశం కోర్టులో పెండింగ్‌లో ఉండగానే..ఇటు తెలంగాణ ఎన్నికల సంఘం స్థానిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేసింది. అక్టోబర్ 9వ తేదీన నోటిఫికేషన్..అదే రోజు నామినేషన్లు ప్రారంభమవుతాయని ఎస్ఈసీ తెలిపింది. అయితే ఇప్పటికే రిజర్వేషన్ల కోటా 50శాతం దాటడంపై హైకోర్టు హౌస్ మోషన్ పిటిషన్ దాఖలైంది. విచారణ జరిపిన హైకోర్టు..తదుపరి విచారణను అక్టోబర్ 8కి వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో అక్టోబర్ 8న కోర్టు ఇచ్చే ఆదేశాలే లోకల్ బాడీ ఎన్నికల ఉన్నట్లా..లేనట్లా అనేది తేల్చనుంది. రిజర్వేషన్లపై జీవో రద్దు చేయాలంటూ వేసిన పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు..కావాలంటే ఎన్నికలను వాయిదా వేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. గవర్నర్ దగ్గర బిల్లు పెండింగ్‌లో ఉన్నప్పుడు జీవో ఎలా ఇస్తారు.? 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఉండకూడదన్న విషయం తెలియదా..? అంటూ ప్రశ్నించింది కోర్టు. ఈ సందర్భంగా గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన మూడు తీర్పులనూ హైకోర్టులో ప్రస్తావించారు పిటిషనర్ తరపు న్యాయవాది. అయితే సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు నిర్వహించాలని కోర్టు ఆదేశిందన్న విషయాన్ని లేవనెత్తారు అడ్వకేట్ జనరల్. దీంతో అవసరమైతే మరో 2, 3నెలల సమయం కోరుతూ అఫిడవిట్ వేసుకోవాలని సలహా ఇచ్చింది కోర్టు. అలాగే నోటిఫికేషన్ ఎప్పుడు ఇస్తారని ఈసీని హైకోర్టు అడగగా ఏ క్షణంలోనైనా నోటిఫికేషన్ ఇస్తామని ఈసీ చెప్పింది. ఒకవేళ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినా విచారిస్తామని స్పష్టం చేసింది న్యాయస్థానం. ఈ క్రమంలో అక్టోబర్ 8న హైకోర్టు ఇచ్చే ఆదేశాల మీదే లోకల్ బాడీ ఎన్నికల నిర్వహణ ఆధారపడి ఉంటుంది.

**మహారాష్ట్ర ఎపిసోడ్‌ను గుర్తుచేస్తున్న ఎక్స్‌పర్ట్స్..** అయితే మహారాష్ట్ర ఎపిసోడ్‌ను గుర్తు చేస్తున్నారు లీగల్ ఎక్స్‌పర్ట్స్. మహారాష్ట్రలో అక్కడి ప్రభుత్వం..స్థానిక ఎన్నికల్లో 50శాతం లిమిట్‌ను దాటి..రిజర్వేషన్లు పెంచి..ఎన్నికలు వెళ్లింది. ఎన్నికలు అయిపోయాయి. స్థానిక ఎన్నికల కూడా ఫలితాలు వచ్చాయి. ఆ తర్వాత ఆరు నెలలకు కోర్టు విచారణ చేపట్టి..ఎన్నికల్లో గెలిచిన వారి సభ్యత్వాలను కూడా రద్దు చేసింది. మళ్లీ రిజర్వేషన్ల కోటా 50శాతానికి లోబడి..ఎన్నికలు పెట్టాలని ఆదేశించింది. న్యాయస్థానం ఆర్డర్స్ ప్రకారం మహారాష్ట్రలో మళ్లీ స్థానిక ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం 50శాతం రిజర్వేషన్ దాటొద్దన్న నిబంధనను అతిక్రమించడానికి వీల్లేదు. ఈ క్రమంలో తెలంగాణలో కూడా స్థానిక ఎన్నికల్లో బీసీ కోటా ఇప్పట్లో సాధ్యం కాదన్న టాక్ వినిపిస్తోంది. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే షెడ్యూల్ రిలీజ్ చేసింది కాబట్టి..ఎన్నికలు ఆపొద్దు అనుకుంటే చట్టప్రకారం బీసీ రిజర్వేషన్లు ఇంప్లిమెంట్ కాకుండానే ఎలక్షన్స్ జరుగొచ్చు. ఒకవేళ బీసీ కోటా అమలు చేశాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలంటే మాత్రం..లోకల్ బాడీ పోల్స్ మరోసారి వాయిదా పడటం ఖాయమని అంటున్నారు లీగల్ ఎక్స్‌పర్ట్స్. మరోవైపు ఇప్పటికే గ్రామాల్లో స్థానిక అలజడి స్టార్ట్ అయింది. పోటీ చేసే అభ్యర్థులు ఆల్రెడీ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. సరిగ్గా ఇదే టైమ్‌లో దసరా పండుగ కూడా వస్తుంది. దీంతో ఎన్నికల బరిలో నిలవాలనుకునే ఆశావహులు కూడా కోర్టు టెన్షన్ పెడుతోంది. ఎన్నికలు జరుగుతాయో..వాయిదా పడుతాయో తెల్వదు. ఎన్నికలు జరగవని ఖర్చు పెట్టుకుండా ఉంటే వెనకబడిపోయే పరిస్థితి. ఒకవేళ ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు దసరా సందర్భంగా యాటలు, లిక్కర్ బాటిల్స్ ఇస్తే ఖర్చు తడిసిమోపెడు అవడం ఖాయం. తీరా అంత ఖర్చు పెట్టి హంగామా చేశాక ఎన్నికలు వాయిదా పడితే పరిస్థితి ఏంటని లోకల్ లీడర్లు కూడా ఆందోళనలో ఉన్నారట. ఈ నేపథ్యంలో అక్టోబర్ 8న హైకోర్టు తీర్పు ఎలా ఉండబోతుందో..? స్థానిక పోరు ఉన్నట్లా.? లేనట్లా.? అనేది వారం రోజులు వెయిట్ చేయాల్సిందే.

# ఇరాన్‌లోనూ భారత్‌ను వదలని ట్రంప్..!

## చబహార్ పై అమల్లోకి ఆంక్షలు..!



రష్యా చమురు కొనుగోలు చేస్తున్నామనే కారణంతో మన దేశంపై భారీగా సుంకాలు విధిస్తూ వస్తున్న అమెరికా అధ్యక్షుడు మరోసారి కేంద్రాన్ని తీవ్ర ఒత్తిడిలోకి నెట్టారు. ఇప్పటివరకూ భారతీయ ఎగుమతులపై సుంకాల మోతతో భయపెడుతున్న ట్రంప్.. ఈసారి మాత్రం ఇరాన్ తో పాటు భారత్ పైనా ప్రభావం చూపే నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఒకేసారి ఇరు దేశాల్నీ ఇబ్బంది పెట్టబోతున్నారు. దీనికి ఎలా కౌంటర్ ఇవ్వాలనే దానిపై కేంద్రం మల్లగుల్లాలు పడుతోంది.

**చబహార్ పోర్టుపై ఆంక్షలు...** ఇరాన్ లో భారత్ చబహార్ పోర్టు నిర్మిస్తోంది. పశ్చిమాసియాలో వ్యూహాత్మకంగా పట్టు కోసం కేంద్రం గతంలో ఈ మేరకు ఇరాన్ తో ఈ మేరకు ఒప్పందం చేసుకుంది. అయితే తాజాగా ఇజ్రాయెల్ యుద్ధం తర్వాత ఇరాన్ పై ఆగ్రహంగా ఉన్న ట్రంప్.. భారత్ తో పాటు ఆ దేశాన్నీ ఇబ్బంది పెట్టేలా ఆంక్షలకు తెరలేపారు. చబహార్ పోర్టుపై ఆంక్షలు విధిస్తామని ఇప్పటికే ప్రకటించిన ట్రంప్.. అనుకున్నట్లుగానే ఈ నిర్ణయాన్ని అమల్లోకి కూడా తెచ్చేశారు.

**టార్గెట్ ఇరాన్ అణు కార్యక్రమం...** ఇరాన్ అణు కార్యక్రమానికి నిధులు అందకుండా చేసేందుకు అమెరికా ఈ ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది. అయితే ఇందులో భారత్ ఇరుక్కున్నట్లయింది. ఇప్పటికిప్పుడు ఇరాన్ తో తెగదెంపులు చేసుకుని చబహార్ పోర్టు ప్రాజెక్టు నుంచి భారత్ వైదొలగే అవకాశాలు లేవు.

ఈ నేపథ్యంలో అమెరికా ఆంక్షల ప్రభావాన్ని ఇరాన్ తో పాటు భారత్ కూడా భరించాల్సి ఉంటుంది. తాజాగా భారతీయ సినిమాలు, ఫర్నిచర్ ఎగుమతులపై ఏకంగా 100 శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించిన ట్రంప్.. ఇప్పుడు ఇరాన్ లో పోర్టు విషయంలోనూ ఆంక్షల కొరడా ఝుళిపించడం కేంద్రానికి మింగుడుపడటం లేదు.

**చబహార్ ఒప్పందం...** 2018లో పాకిస్తాన్ ద్వారా కాకుండా ఆఫ్ఘనిస్తాన్‌కు వెళ్లేందుకు భారత్ కు ఇరాన్ లోని చబహార్ లో పోర్టు నిర్మాణం అవసరమైంది. పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్‌లో గ్వాదర్ ఓడరేవును చైనా అభివృద్ధి చేయడానికి కౌంటర్ గా భారత్ ఈ మార్గం ఎంచుకుంది. కానీ 2021లో తాలిబన్లు ఆఫ్ఘనిస్తాన్ లో అధికారం చేపట్టడంతో పరిస్థితి మారిపోయింది. ఆ తర్వాత అమెరికాలో ట్రంప్ అధికారంలోకి రావడంతో భారత్,ఇరాన్ పై కక్షసాధింపు ప్రారంభమైంది.

దీంతో ఇప్పుడు చబహార్ పోర్టుపై ఆంక్షలతో భారత్, ఇరాన్‌ను కట్టడి చేసేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారు.

**భారత్ పై ఆంక్షల ప్రభావం...** ఈ ఆంక్షల వల్ల ప్రభుత్వ రంగ ఇండియా పోర్ట్స్ గ్లోబల్ లిమిటెడ్‌తో సహా భారతీయ సంస్థలు చబహార్ నుండి నిష్క్రమించడానికి 45 రోజుల సమయం ఉంది. లేదా వారి ఆస్తుల స్తంభన సహా ఇతర చర్యలు తీసుకునేందుకు అమెరికా సిద్ధమవుతోంది. భారత్ ఈ పోర్టు కోసం పదేళ్లలో 370 మిలియన్ డాలర్లు ఇచ్చే ఒప్పందంలో ఉంది. ఇప్పుడు ట్రంప్ చర్యపై భారత్ వేచిచూసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దూకుడు నిర్ణయాలకు బదులు వ్యూహాత్మకంగా గల్ఫ్ దేశాలతో భాగస్వామ్యం పెంచుకోవడం ద్వారా దీనికి కౌంటర్ ఇవ్వాలని భారత్ భావిస్తోంది.

# సంపాదకీయం

## కరూర్ సాక్షిగా తమిళ రాజకీయం కీలక మలుపు తీసుకోబోతోందా ?

ఎన్నో ఆశలతో విజయ్ పార్టీని తమిళనాడులో స్థాపించారు. ఆయన పార్టీ పెట్టాక వచ్చిన ఊపే వేరు అన్నట్లుగా ఉంది. ఎక్కడికి వెళ్ళినా లక్షలలో జనాలు తరలివచ్చారు ఒక దశలో ఒక సభలో అయితే ఏకంగా పది లక్షల మంది దాకా జనాలు వచ్చారని అది జాతీయ స్థాయి రికార్డుగా కూడా క్రియేట్ అయింది. విజయ్ పార్టీకి జనాలు పోటెత్తున్నారు. తమిళనాడులో ఎన్నికలు మరో ఆరేడు నెలలలో ఉంటాయనగా జనాలు వేలం వెర్రిగా విజయ్ పార్టీ వైపు పరుగులు తీయడం చూసిన వారికి ఉమ్మడి ఏపీలో 1982 నాటి రోజులు గుర్తుకు వచ్చాయి. ఆనాడు ఎన్టీఆర్ టీడీపీ పెట్టి జనంలోకి వెళ్తే ఇదే తీరున జన సంద్రం కనిపించింది.

**మార్పు కోసమేనా :** విజయ్ సభలకు వచ్చే జనాలు చూసేందుకే అని చాలా మంది విశ్లేషించారు. సినీ నటులు రాజకీయాల్లకి వచ్చి చేతులు కాల్చుకున్న వారు కూడా కొట్టి పారేస్తున్నారు. జస్ట్ అలా జనాలు వస్తారు కానీ నిజానికి వీరంతా పోలింగ్ బూత్ లకు వెళ్ళరని కూడా హాట్ కామెంట్స్ చేశారు. అయితే వస్తున్న జనాలలో యూత్ ఎక్కువగా ఉంది. అంతే కాదు మహిళలు ఎక్కువగా కనిపిస్తున్నారు. ఈ రెండు సెక్షన్లు కనుక ముందు ఉంటే కనుక కచ్చితంగా ఆ పార్టీకి సక్సెస్ రూట్ కనిపిస్తుందని గత చరిత్ర వెల్లడించింది. పైగా తమిళనాడులో ఉన్న రాజకీయాలు వేరు. అక్కడ రెండు పార్టీల వ్యవస్థ ఉండేది. కానీ అన్నా డీఎంకే బలహీనపడడం అదే సమయంలో అయిదేళ్ళ పాటు అధికారంలో ఉన్న డీఎంకేకి మరో చాన్స్ ఇవ్వాలా వద్దా అని జనాలు ఆశిస్తున్న సమయంలో విజయ్ కొత్త పార్టీతో ముందుకు వచ్చారు.

**కరెక్ట్ టైం లో :** ఇక ఒక్కసారి వెనక్కి చూసుకుంటే 2021 ఎన్నికల్లోనే విజయ్ పార్టీ పెట్టి వస్తారు అని అంతా అనుకున్నారు. కానీ విజయ్ తనదైన వ్యూహం తోన ఆనాడు పార్టీ పెట్టలేదు. ఎందుకంటే అప్పటికి రెండు సార్లు అన్నా డీఎంకే అధికారంలో ఉంది. జనాలు మరో బలమైన పార్టీగా డీఎంకే వైపు మొగ్గు చూపిస్తున్నారు. ఆ సమయంలో పార్టీ పెడితే ఫోకస్ అంతా డీఎంకే పైన ఉన్న వేల ఇబ్బంది అవుతుందని భావించే విజయ్ తన ప్లాన్ ని 2026కి మార్చుకున్నారు. అనుకున్నట్లుగా అన్నీ సెట్ చేసుకుని ఆయన బరిలోకి దిగారు. ఇపుడు డీఎంకే వర్సెస్ విజయ్ టీవీకేగా రాజకీయం మారుతోంది. మరో వైపు చూస్తూ జనాలు మార్పు వైపు మొగ్గు చూపుతున్న నేపధ్యం ఉంది. అన్నీ అనుకూలిస్తే విజయ్ పార్టీ అద్భుతాలు క్రియేట్ చేయగలదు అనుకుంటున్న టైంలో కరూర్ లో ఘోర దుర్ఘటన జరిగింది.

**దూకుడుకు బ్రేకేనా :** తమిళనాడు కరూర్ లో జరిగిన ఘోర ఘటనతో విజయ్ టీవీకే పార్టీ పూర్తిగా ఆత్మ రక్షణలో పడింది రాజకీయాలకు కొత్త ఇంకా పార్టీ నిర్మాణం జరగలేదు, ఇంతలో అతి పెద్ద ఎదురు దెబ్బ, ఏకంగా 40 మందికి పైగా అమాయకులు చనిపోవడం అన్నది పార్టీకి ఏ విధంగా చూసినా తీరని నష్టం గానే మారుతోంది. ఇక విజయ్ అరెస్ట్ అంటున్నారు. అలాగే రాబోయే రోజులలో ఆయన సభలు జరగకుండా కట్టడి చేసే అవకాశాలు ఉన్నాయి. ఒక్కసారిగా టీవీకే రాజకీయం తిరగబడినట్లు అయింది. ఏమి జరుగుతోందో కూడా కనీసంగా విజయ్ పార్టీ నేతలకు అర్ధం కాని విషయం. దశాబ్దాల అనుభవం కలిగిన డీఎంకే అలాగే ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ విషయంలో ఏ రకంగా ముందుకు వెళ్తారో కూడా ఒక పెద్ద చర్చ. దాంతో టీవీకే అయితే ఒంటరిగానే పోరాడాల్సి ఉంటోంది.

**బీజేపీ మద్దతు :** ఈ క్రమంలో అనూహ్యంగా బీజేపీ నుంచి టీవీకే కిఅనూహ్యమైన మద్దతు దక్కుతోంది. ఆ పార్టీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై అయితే బహిరంగంగానే విజయ్ కి మద్దతు ఇచ్చారు విజయ్ తప్పు ఇందులో లేదు అన్నారు ఇంతటి ఘోరం జరగడం వెనక కచ్చితంగా ప్రభుత్వం ఉదాశీనత ఉందని అన్నారు. ఒక రాజకీయ పార్టీ సభలకు వచ్చే జనాలను అంచనా వేసుకుని తగిన విధంగా ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంటుందని అన్నారు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న ఒక కొత్త పార్టీకి జాతీయ స్థాయిలో అధికారంలో ఉన్న బలమైన బీజేపీ నుంచి ఇలా మద్దతు దక్కింది. ఈ సమయంలో దీనిని తీసుకోవడం కూడా విజయ్ కి అవసరమే అవుతుంది అని అంటున్నారు. ఒక వేళ ఆయన తీసుకోకపోతే పరిణామాలు కూడా ఏ విధంగా మారుతాయో అన్నది ఉంది. ఏది ఏమైనా తమిళ రాజకీయం కరూర్ సాక్షిగా కీలక మలుపు తీసుకోబోతోందా అన్నదే చర్చగా ఉంది మరి.

## భక్తిశ్రద్ధలతో ఘనంగా దుర్గామాత పూజ





శామీర్ పేట, సెప్టెంబర్ 30 (గరుడ వార్త) : దసరా పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో ఘనంగా దుర్గామాతకు పూజలు నిర్వహించారు. మంగళ వారం ఉమ్మడి శామీర్ పేట మండలంలోని వివిధ గ్రామాలలోని విద్యుత్ సబ్‌స్టేషన్లలో అధికారులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు అమ్మవారికి ఎంతో భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అందర్నీ చల్లంగా చూడాలని మొక్కుకున్నారు.

## సద్దుల బతకమ్మ సంబరాలు




శామీర్ పేట, సెప్టెంబర్ 30 (గరుడ వార్త : పూర్వ ఉమ్మడి శామీర్ పేట మండలంలో సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటాయి. మంగళవారం ఉమ్మడి మండలంలోని తూంకుంట మున్సిపల్, శామీర్ పేట మండలం, మూడు చింతల పల్లి మున్సిపల్ లోని వివిధ గ్రామాల లో సద్దుల బతుకమ్మ సంబరాలను ఆనందోత్సవాల మధ్య జరుపుకు న్నారు. గత తొమ్మిది రోజుల నుంచి ఆయా గ్రామాలలో బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. చివరిరోజు మహిళలు అత్యంత ఉత్సాహంతో, భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. రంగురంగుల పూలతో మహిళలు, యువతులు, చిన్నారులు ఎంతో ఉత్సాహంగా బతుకమ్మలను తయారు చేసుకొని ఇళ్ల ముందు పెట్టి ఆటాడి అనంతరం ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడలిలో పెట్టి బతుకమ్మ పాటలను పాడుతూ లయబద్ధంగా ఆటలు



ఆడారు. అనంతరం చెరువులు, కుంటల వద్ద పాటలు పాడు తూ బతుకమ్మ ఆటలాడి చెరువుల్లో నిమజ్జనం చేశారు. అనంతరం పసుపు కుంకుమ వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

## దుర్గాదేవి అలంకరణలో అమ్మవారి దర్శనం



శామీర్ పేట, సెప్టెంబర్ 30 ( గరుడ వార్త ) : శరన్నవ రాత్రుల్లో భాగంగా అమ్మవారిని దుర్గాదేవి అలంకరణతో ఉన్న దుర్గాదేవి అమ్మవారి రూపానికి భక్తులు పూజలు నిర్వహించారు. దుర్గాదేవి అవతారాన్ని పురస్కరించుకొని వివిధ రకాల ఆభరణాలు, పూలదండలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మంగళవారం శ్రీ దుర్గదేవి అవతారం కావడంతో భక్తులు ఉదయం హెూమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు కేతావత్ సుధాకర్ నాయక్ అమ్మవారి వద్ద జరుగు తున్న అన్నదానానికి 25 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమం లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శివాలయం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్న ప్రసాద వితరణ చేశారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ

శామీర్ పేట, సెప్టెంబర్ 30(గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద శామీర్ పేటకు చెందిన గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టగా అల్వాల్ కు చెందిన ప్రేమ్ కుమార్ వారి





కుటుంబ సభ్యులు 50 కేజీల బియ్యం, తూముకుంటకు చెందిన మాధవరెడ్డి 25 కేజీల బియ్యం, అలియాబాద్ కు చెందిన సాయి కృష్ణ 25 కేజీల బియ్యం అందజేశారు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి విచ్చేసే భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

## సైబర్ మోసాలకు గురయ్యారా..!

మణుగూరు : సాంకేతికత విపరీతంగా పరుగులు పెడుతున్న ప్రస్తుత రోజుల్లో కూడా సైబర్ నేరగాళ్లు చెలరేగిపోతున్నారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని ఓటీపీ చెప్పాలని, బహుమతులు గెల్చుకున్నారని వాటిని చూడాలంటే లింకులు క్లిక్ చేయాలని, బైనరీ కోడ్‌తో ఇమేజ్‌లు పంపుతూ మోసాలకు తెరలేపుతూ రూ.కోట్లు దోచేస్తున్నారు. ఏదో ఒక ప్రాంతంలో ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. విద్యావంతులు సైతం మోసపోతుండటం ఆందోళనకు గురి చేస్తోంది. సైబర్ నేగరాళ్ల బారిన పడినప్పుడు మొదటి గంటలోపే మేల్కొంటే సాధ్యమైనంత వరకు ప్రమాదం నుంచి బయటపడవచ్చునని భద్రాద్రి కొత్తగూడెం సైబర్ క్రైం సీఐ జితేందర్ సూచించారు. ఆ లోపే నేరగాళ్లు డబ్బులు డ్రా చేసుకుంటే మాత్రం తిరిగి రప్పించడం కష్టమవుతుందన్నారు.

**1930కి ఫోన్ చేయాలి..**

1930 కాల్ సెంటర్‌కు బ్యాంకుల రిస్క్ మేనేజ్‌మెంట్ బృందాలు అనుసంధానమై ఉంటాయి. సైబర్ నేరాలకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే వారు స్పందించి చర్యలు తీసుకుంటారు. బ్యాంకు ఖాతాల నుంచి సైబర్ నేరగాళ్ల డబ్బులను ఎక్కడికి మళ్లించుకుంటున్నారో గుర్తించి ఆ ఖాతాలను వెంనే ఫ్రీజ్ చేస్తారు. డబ్బు డ్రా చేసుకునే అవకాశం లేకుండా కట్టడి చేస్తారు.

**ఇలా చేయొచ్చు..**

సైబర్ మోసానికి గురైన వెంటనే సైబర్‌క్రైం.జీవోవీ.ఇన్ పోర్టల్‌ను క్లిక్ చేయాలి. హెూం పేజీలోకి వెళ్లి ఫైల్ ఏ కంప్లైంట్ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే అక్కడ కనిపించే నిబంధనలు చదవాలి.



రిపోర్ట్ అదర్ సైబర్ క్రైం బటన్‌పై క్లిక్ చేయాలి. తర్వాత సిటిజన్ లాగిన్ ఆప్షన్ సెలెక్టు చేసి పేరు, ఫోన్ నంబరు, ఈ-మెయిల్ తదితరాలు నమోదు చేయాలి.

రిజిస్టర్ మొబైల్ నంబరుకు ఓటీపీ వస్తుంది. దానిని నమోదు చేసి క్యాప్చర్ కోడ్ పొందుపర్చి మీట నొక్కాలి.

తర్వాత పేజీలోకి వెళ్లిన వెంటనే నేరం గురించి క్లుప్తంగా వివరించాలి. సెక్షన్లుగా విభజించి ఉంటుంది. సాధారణ సమాచారం, సైబర్ నేరానికి సంబంధించిన సమాచారం, ప్రివ్యూ అని ఉంటాయి.

ప్రతి సెక్షన్‌లో అడిగిన వివరాలు నమోదు చేస్తూ ప్రక్రియ పూర్తి చేయాలి. మూడు సెక్షన్లు పూర్తయ్యాక ప్రివ్యూ పరిశీలించాలి.

అన్ని వివరాలు సక్రమంగా ఉంటే సబ్మిట్ బటన్ నొక్కాలి. తర్వాత ఘటన ఎలా జరిగిందో వివరించాలి. నేరానికి సంబంధించిన స్క్రీన్ షాట్(ఖాతా లావాదేవీలు) వంటి ఆధారాలు, సాక్ష్యాలు అందులో పొందుపర్చాలి. అన్ని మరోసారి పరిశీలించి సబ్మిట్ బటన్ నొక్కితే కన్ఫర్మేషన్ సమాచారం వస్తుంది. కంప్లైంట్ ఐడీతో పాటు ఇతర వివరాలు ఈ-మెయిల్ ఐడీకి వస్తాయి. ఆ తర్వాత అధికారులు దర్యాప్తు ప్రారంభిస్తారు. ఫిర్యాదు చేయడం ఆలస్యమైతే దుండగులు వేర్వేరు ఖాతాల్లోకి నగదు బదిలీ చేస్తారు. లేకుంటే క్రిప్టోకరెన్సీగా ఆపై డాలర్లుగా మార్చుకునే అవకాశం ఉంటుంది.

## స్వశక్తికి అక్షర వెలుగులు

మెట్‌పల్లి : గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులైన మహిళల్లో అక్షర వెలుగులు నింపడంతో పాటు చదువు మధ్యలో ఆపేసిన వారికి విద్య అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణ చేపట్టాయి. విద్యాశాఖ, సెర్ప్ సంయుక్త ఆధ్వర్యంలో ఉల్లాస్(అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ సొసైటీ), తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం(టాస్) ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే ప్రక్రియ ప్రారంభించారు. ఈ మేరకు జిల్లాలోని స్వశక్తి సంఘాల్లో చదువు రాని, మధ్యలో ఆపేసిన సభ్యులను గుర్తించి ఇప్పటికే యాప్‌లో వివరాలు నమోదు చేశారు. వీరికి చదువు నేర్పి ఆర్థిక డిజిటల్ అక్షరాస్యత, వాణిజ్య నైపుణ్యాలు, ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పిస్తారు.

**41,797 మంది గుర్తింపు**

జిల్లాలో 14 వేలకు పైగా స్వయం సహాయక సంఘాల్లో 1.79 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వీరిలో అక్షరాస్యత పెంపొందించడానికి నడుం బిగించారు.

ఇందులో భాగంగా క్షేత్ర స్థాయిలో నిరక్షరాస్యులైన అతివలను గుర్తించారు. గ్రామాల్లో సర్వే నిర్వహించి జిల్లావ్యాప్తంగా 41,797 మందిని నిరక్షరాస్యులను గుర్తించారు.

వీరికి అక్షరాలు నేర్పడానికి పది మందికి ఒకరు చొప్పున సంఘాల్లోని ఔత్సాహిక మహిళలను వాలంటీర్లుగా ఎంపిక చేశారు.

జిల్లావ్యాప్తంగా 4,151 మంది వాలంటీర్లను గుర్తించి వివరాలను యాప్‌లో నమోదు చేశారు. మండలాల వారీగా ఉపాధ్యాయులకు, వీవోఏలకు శిక్షణ ఇచ్చారు. చదువు చెప్పేందుకు అవసరమైన పుస్తకాలు మండలాలకు చేరుకున్నాయి. గ్రామ స్థాయిలో వాలంటీర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. చదువు నేర్చుకున్న తర్వాత వచ్చే ధ్రువీకరణ పత్రంతో మహిళలు తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం(టాస్) ద్వారా పదో తరగతి, ఆపై చదువు పూర్తి చేసే అవకాశం కల్పించారు.

**మధ్యలో ఆపేసిన వారికి సార్వత్రిక విద్య**



ఆర్థిక వెనుకబాటు, కుటుంబ పరిస్థితులతో మధ్యలో చదువు ఆపేసిన మహిళలపైనా దృష్టి సారించారు. తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం(టాస్) ద్వారా వీరికి అవసరమైన విద్య అందించడానికి చర్యలు తీసుకుంటున్నారు. వారిని ఓపెన్ స్కూల్‌లో చేర్పించి చదువుకొనేలా ప్రోత్సహిస్తున్నారు. జిల్లాలో పదో తరగతిలోపు 373 మంది, ఇంటర్మీడియట్‌లోపు 510 మంది మహిళలు చదువు ఆపేసినట్లు గుర్తించారు. వీరు పై చదువులు చదివేలా అవగాహన కల్పించారు. ఉన్నత విద్యతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రోత్సహిస్తూ ఇప్పటివరకు 291 మంది పదో తరగతి, 419 మంది ఇంటర్‌లో చేరేందుకు ప్రవేశ రుసుం చెల్లించారు. స్వశక్తి సంఘాల సభ్యుల్లో పూర్తి స్థాయిలో అక్షరాస్యులైన సభ్యులే ఉండేలా చూస్తూ వారికి భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు పెంచడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

## భక్తి తోవ.. సెలవుల్లో చుట్టొద్దామా!



ధర్మపురి : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పర్యాటక, ఆధ్మాత్మిక ప్రాంతాలను చుట్టేయడానికి దసరా సెలవులు మంచి సమయం. ఎన్నో ప్రాంతాలు ఉత్సాహం నింపేందుకు అందుబాటులో ఉన్నాయి. దక్షిణ కాశీ.. వేములవాడ: వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. స్వామి ఆలయానికి సమీపంలో శ్రీ భీమేశ్వరాలయం ప్రకృతి రమణీయంగా ఉంటుంది. ఇక్కడ చెట్లు, భారీ రాతి నిర్మాణాలు.. ఈ క్షేత్రానికి దగ్గరలోనే నాంపల్లి గుట్ట ఆలయం పర్యాటకులను ఆకట్టుకుంటాయి.

శిల్పకళకు ప్రాచుర్యం: కాకతీయ కళావైభవాన్ని నగునూరి ఆలయం మనకు పరిచయం చేస్తోంది. శివ, విష్ణు, ఆలయాలు కలిసిన ఈ ప్రదేశం పర్యాటకులను ఆకర్షిస్తోంది.

నారసింహక్షేత్రం.. : దక్షిణాభిముఖంగా ప్రవహిస్తున్న గోదావరి తీర క్షేత్రం ధర్మపురి. బ్రహ్మపుష్కరిణీ తెలంగాణలోనే ప్రాచుర్యం పొందింది. సత్యవతీ ఆలయం, ఇసుకస్తంభం, బ్రహ్మగుండం, సత్యవతిగుండాలు చూడదగిన స్థలాలు. శ్రీరాముడి స్వహస్తాలతో ప్రతిష్ఠించిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం దీని పక్కనే ఉంటోంది.

చుట్టూ గుట్టలతో కొండగట్టు: కొండల మధ్యన వెలసిన ఆంజనేయస్వామి దేవాలయం ప్రకృతి రమణీయతతో కూడి ఉంది. హనుమాన్ భక్తులు వేలాది మంది ఇక్కడే తమ దీక్షలను ముగిస్తారు. ఘాట్‌రోడ్డు, కోనేరు ఎంతో అందంగా ఉంటాయి. రామగిరి కోట..: ఇది పాండవులు వనవాసం గడిపిన ప్రదేశమని చెబుతుంటారు. ఈ ప్రాంతంలో సీతమ్మ కొలను సైతం ఉంది. పర్వత శిఖరంపై నిర్మించిన కోట పర్యాటకుల్లో ఉత్సాహం నింపుతోంది. ఇలాంటి ప్రదేశాలతోపాటు కోటిలింగాల, విలాసాగర్, త్రిలింగ సంగమేశ్వరాలయం, కొత్తకొండ వీర భద్రేశ్వరస్వామి ఆలయం, మల్లాపూర్ మండలంలోని సోమేశ్వర కొండ పర్యాటకులను ఆకర్షిస్తోంది. ప్రస్తుతం రాయపట్నం గోదావరి ఉగ్రరూపంతో ప్రవహిస్తోంది.

## బాలికలకు మరింత భరోసా

నిర్మల్ : ఇందిరా మహిళా శక్తి కింద సంఘాలు, సభ్యుల ఆర్థిక అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో కిశోర బాలికలకు సభ్యత్వం కల్పించాలని నిర్ణయం తీసుకుంది. వారిలో ఆర్థిక అక్షరాస్యతను ఇప్పటి నుంచే పెంపొందించాలన్నది ప్రధాన లక్ష్యం. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. 15–18 ఏళ్లలోపు కలిగిన బాలికలతో సంఘాలు ఏర్పాటు చేసేందుకు తగిన కార్యాచరణ రూపొందించారు. ఒక వేళ ఆ ప్రాంతంలో తక్కువ ఉంటే సమీపంలోని ఎస్‌హెచ్‌జీలలో వీరికి సభ్యత్వం కల్పించనున్నారు.

**ఆర్థిక అక్షరాస్యత దిశగా..**

జిల్లా వ్యాప్తంగా 14,245 మంది కిశోర బాలికలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. చిన్న వయసులోనే వారిలో ఆర్థిక అక్షరాస్యత కల్పించాలన్న ప్రధాన ఉద్దేశంతో ప్రభుత్వం సంఘాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. డబ్బులు వృథా చేయకుండా పొదుపు పాటించడ



ంతో వాటి విలువ తెలుసుకుంటారు. ఉన్నత విద్యా మార్గదర్శకత్వం కోసం ఆయా కార్యక్రమాలు ఇందులో వివరించనున్నారు. కొత్త స్నేహితులు లభించనుండటంతో మరింత లబ్ధి కలగనుంది. సేఫ్టీ (భద్రత), న్యూట్రిషియన్ (పోషక విలువల ఆహారం), ఎంపవర్‌మెంట్ (సాధికారత), హెల్త్ (ఆరోగ్యం) ఎడోలెసెంట్స్ (కిశోర బాలికల)కు 'స్నేహ' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించడంలో నిమగ్నమయ్యారు. ఇప్పటి వరకు కిషోర బాలికలకు సంబంధించి 369 ఎస్‌హెచ్‌జీలు ఏర్పాటు చేశారు.

ప్రస్తుత సంఘాలు : 12,047

సభ్యులు : 1,72,203

15– 18 ఏళ్లలోపు కిశోర బాలికలు : 14,245

ఎస్‌హెచ్‌జీల లక్ష్యం : 1,424

ఇప్పటి వరకు పూర్తయిన ఎస్‌హెచ్‌జీలు : 369

**ఎంతో మేలు**

విజయలక్ష్మి, డీఆర్డీవో, నిర్మల్

కిశోర బాలికలను చైతన్యవంతం చేసి వారితో సంఘాల ఏర్పాటుకు తగిన కార్యాచరణ సిద్ధం చేశాం. ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకునేలా అవగాహన కల్పించాం. చిన్న వయసులోనే డబ్బులు వృథా చేయకుండా పొదుపు పాటించడంతో వారికి భవిష్యత్తులో మంచి సత్ఫలితాలు కలగనున్నాయి. ఈ సంఘాలతో వారికి ఎంతో మేలు. అందరూ సద్వినియోగం చేసుకునేలా ప్రత్యేకత కనబరుస్తున్నాం.

## ఉత్కంఠ.. ఆసక్తి




సిరిసిల్ల : పంచాయతీలు, స్థానిక సంస్థల రిజర్వేషన్ల ప్రక్రియ జిల్లాలో పూర్తయింది. ఈ మొత్తం వివరాలను సీల్డ్ కవర్‌లో రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ఏ స్థానం.. ఏ కేటగిరీకి ఖరారు అవుతుందనేది ఆశావహుల్లో ఉత్కంఠ రేపుతోంది. వివరాల కోసం ఆరా తీస్తున్నప్పటికీ అధికారులు మాత్రం పూర్తిగా గోప్యత పాటిస్తున్నారు. జిల్లాలో రెండ్రోజుల పాటు జరిగిన ఈ ప్రక్రియ శుక్రవారం రాత్రితో ముగిసినట్లు తెలుస్తోంది.

**పకడ్బందీగా..** జిల్లాలో మొత్తం 12 జడ్పీటీసీ, 123 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీలకు 42 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 27 శాతం కలిపి మొత్తం 69 శాతం రిజర్వేషన్లు అమలు చేయబోతున్నట్లు స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే 5 జడ్పీటీసీ, 5 ఎంపీపీలు, 123 ఎంపీటీసీ స్థానాల్లో 109 కేటాయించే అవకాశం ఉంది.

ఎస్సీ, ఎస్టీలకు 2011 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్‌లు కల్పించనున్నారు. గిరిజన జనాభా 50 శాతానికిపైగా ఉంటే జనాభా దామాషా ప్రకారం.. వందశాతం బంజారాలు ఉన్న చోట వారికే ఆ స్థానాలను ఖరారు చేస్తారు. వీరికి రిజర్వేషన్ కల్పించిన పిదప మిగిలిన స్థానాలకు అన్ రిజర్వ్‌గా ప్రకటిస్తారు. గతంలో కేటాయించిన స్థానాలు మినహా మిగతా చోట్ల మహిళలకు యాభై శాతం రిజర్వేషన్‌ను లాటరీ పద్ధతిలో ఎంపిక చేయనున్నట్లు సమాచారం.

స్థానిక సంస్థల రిజర్వేషన్‌కు తుది రూపం ఇచ్చేందుకు పలు విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు, సిబ్బంది శ్రమిస్తున్నారు. తుది జాబితా కొలిక్కి తెచ్చేందుకు ఒకటికి రెండుసార్లు వివరాలు సరిచూసుకుంటున్నారు. ఎక్కడా పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా జాబితాను రూపొందిస్తున్నారు.

**శిక్షణ తరగతులు**

జిల్లాలో గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ కోసం మండలాల వారీగా పీవో, ఏపీవోలుగా నియామకమైన వారికి శుక్రవారం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఇదివరకే నామినేషన్లు స్వీకరించే ఆర్వోలకు శిక్షణ తరగతులు పూర్తి చేశారు. మండలాల వారీగా ఎన్నికల అధికారుల నియామకానికి జిల్లా పరిషత్తు అధికారులు కసరత్తు ప్రారంభించారు.

**గత ఎన్నికల్లో ఇలా..**

2019లో జిల్లాలో 255 పంచాయతీల రిజర్వేషన్లు ప్రకటించారు. అందులో తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లికి రిజర్వేషన్ల సమస్యతో ఎన్నికలకు దూరంగా ఉన్నాయి. అప్పటి రిజర్వేషన్లలో ఎస్సీ జనరల్ 25, ఎస్సీ మహిళ 26, ఎస్టీ జనరల్ 15, ఎస్టీ మహిళ 16, బీసీ జనరల్ 28, బీసీ మహిళ 29, జనరల్ 57, జనరల్ మహిళ 58 స్థానాలుగా ఉన్నాయి. గత ఎన్నికల్లో జడ్పీ ఛైర్మన్ అన్‌రిజర్వ్ కావడంతో ప్రస్తుతం ఎవరికి అవకాశం వరిస్తుందని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## సుంకాల మోత..

సంగారెడ్డి: రష్యా నుంచి చమురు కొంటున్నామన్న సాకుతో భారత ఎగుమతులపై అమెరికా ప్రకటించిన అదనపు సుంకాలతో ఉమ్మడి జిల్లాలోని ఫార్మా (ఔషధ కంపెనీల) ఎగుమతులపై ప్రభావం పడే అవకాశం ఉంది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి మరింతగా సుంకాల మోత పెరిగే అవకాశాలున్నట్లు ప్రచారం సాగుతోంది. కొన్ని కంపెనీల ఉత్పత్తులు సగానికిపైగా ఎగుమతులకు అమెరికా గమ్యస్థానంగా ఉంటోంది. ప్రత్యామ్నాయ మార్కెట్లను వెతుక్కోవడం సవాలుగా మారుతోంది.

**అత్యధికం ఇక్కడే**

రాష్ట్రంలోనే అత్యధికంగా ఔషధ కంపెనీలు ఉమ్మడి మెదక్ జిల్లాలో నెలకొని ఉన్నాయి. పలు జాతీయ, అంతర్జాతీయ కంపెనీలకు చెందిన యూనిట్లు ఇక్కడ ఉత్పత్తులు కొనసాగిస్తున్నాయి. శాశ్వత ఉద్యోగులతో పాటు ఒప్పంద ప్రాతిపదికపైనా విధులు నిర్వహిస్తున్నారు. మొత్తంగా 55 వేల మంది ఉపాధి పొందుతున్నారు. ప్రధానంగా సంగారెడ్డి జిల్లా పరిధిలోనే ఎక్కువగా వివిధ రసాయనాలు (ఔషధాలు) తయారు చేసే కంపెనీలు ఉన్నట్లు పరిశ్రమల శాఖ అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. మెదక్, సిద్దిపేట జిల్లాల్లో ఫార్మా కంపెనీలు తక్కువగా ఉన్నాయి.

**ఎగుమతి చేసే ముడిపదార్థాలు**

ముఖ్యంగా రక్తపోటు, మధుమేహం, గుండెజబ్బులు, గ్యాస్ట్రో, మైగ్రేన్, క్యాన్సర్, హెచ్ఐవీ వంటి రోగాలకు సంబంధించిన ఔషధాల ఉత్పత్తితో పాటు తయారీకి వినియోగించే ముడి పదార్థాలు ఉమ్మడి జిల్లాలోని రసాయన పరిశ్రమల్లో తయారు చేస్తున్నారు. భారత్ నుంచి దిగుమతి చేసుకునే దేశాల్లో అమెరికానే ముందు వరుసలో ఉంటోంది. ఉమ్మడి జిల్లాల నుంచి ఏటేటా ఎగుమతి చేసే ఉత్పత్తుల విలువ పెరుగుతోంది.



రెండేళ్ల నుంచి మరింత పెరుగుతోంది. అమెరికా శతశాతం సుంకం విధిస్తున్నట్లు ప్రచారం సాగుతుండడంతో ఎగుమతులపై పరిశ్రమల నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. పలు కంపెనీల యాజమాన్యాలు అమెరికా సుంకాలతో ఏర్పడే ప్రభావంపై అధ్యయనం చేస్తున్నాయి. ఇబ్బందులు ఎదురైతే ఉత్పత్తులను తగ్గించాలని నిర్ణయించినట్లు సమాచారం. కంపెనీలలో విధులు నిర్వహించే ఉద్యోగులతో పాటు కార్మికులపై ప్రభావం పడే అవకాశాలున్నాయి.

ఉత్పత్తుల్లో అమెరికాకు ఎగుమతయ్యే ఔషధాలు 60 శాతం

వివిధ దేశాలకు ఎగుమతి అవుతున్న ఫార్మా వస్తు సేవల విలువ రూ. 18 వేల కోట్లు

పరిశ్రమలు: సంగారెడ్డి 380బీ మెదక్ 120బీ సిద్దిపేట 15

ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్న వారి సంఖ్య 40,000

శాశ్వత ఉద్యోగులు 15,000

## చేను బురదైంది..
## కోతకు కష్టమొచ్చింది

భైంసా: జిల్లాలో సోయా రైతులకు కష్టమొచ్చింది. మొన్నటివరకు వరదలతో లోతట్టు, నదీ పరీవాహక ప్రాంతాల్లో పంటలు మునిగిపోయాయి. కాత దశలో సోయా మురిగిపోయింది. ఇతర ప్రాంతాల్లో సురక్షితంగా ఉన్న పంట చేతికొచ్చే సమయంలో వరుసగా కురుస్తున్న వర్షాలకు చేలల్లో నీరు నిలవడంతో కోత కోసే వీలు లేకుండా పోయింది. హార్వెస్టర్లు చేలలో నడిచే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో కోతకొచ్చిన సోయా పంట కాతలో మొలకలు వస్తున్నాయి. ఆరుగాలం శ్రమ వర్షార్పణం కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

నష్టాలు ఎలా పూడ్చాలని కన్నీటి పర్యంతమవుతున్నారు.

**అధికారి ఏమంటున్నారంటే..**

గజిల్లాలో కోతలకు సరిపోయే హార్వెస్టర్లు ప్రైవేటులో అందుబాటులో ఉన్నాయని డీఏఓ అంజిప్రసాద్ అన్నారు. రైతులు చేలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు.

జిల్లాలో 1.10 లక్షల ఎకరాల విస్తీర్ణంతో సోయా పంట సాగు చేస్తుండగా, అత్యధిక విస్తీర్ణంలో ముథోల్ నియోజకవర్గంలో 80 వేల ఎకరాల్లో, సారంగాపూర్, లక్ష్మణచాంద, మామడ, సోన్, నర్సాపూర్ మండలాల్లో సాగవుతోంది. ఈ లెక్కన ఇక్కడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికే బాసర, భైంసా, తానూరు, ముథోల్ మండలాల్లో సోయా పంటలు నీట మునిగాయి.



వానలు వెనుకబడిన వెంటనే కోతకొచ్చిన సోయా పంట కోతలు మొదలు చేసేందుకు యంత్రాల కొరత ఉన్నట్లు తెలుస్తోంది. అందుబాటులో ఉన్న టైర్ల యంత్రాలు చేలల్లో దిగబడుతున్నాయి. చైన్ హార్వెస్టర్లు రావడం లేదు. వచ్చినా వాటి అద్దె ధరలు ఎక్కువ ఉన్నట్లు రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు కోత యంత్రాలను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. కూలీల కొరత, వ్యయం ఎక్కువ కావడంతో వెనుకడుగు వేస్తున్నారు. భూములు ఆరే వరకు వేచిచూస్తున్నారు. పది రోజులుగా పగలు ఎండ, రాత్రి వాన కురుస్తుండటంతో పంట కోతలకు రైతులకు బెంగ పట్టుకుంది.

మొలకలు వస్తున్నాయి

బొంతల్‌వాడ్ మారుతి రైతు, నంద్‌గాం తానూరు మండలం

ఏడు ఎకరాల్లో సోయా సాగు చేశా. ప్రస్తుతం కోతకు వచ్చింది. వానలకు మూడు ఎకరాల్లోని పంటకు కాయల్లో గింజలకు మొలకలు వస్తున్నాయి. దీంతో పంటకు చేసిన వ్యయం నష్టపోతున్నా. ఎకరాకు 20 వేలకు వరకు ఖర్చయింది. ఎకరాకు 8 నుంచి 10 పది క్వింటాళు దిగుబడి వచ్చేది రాకుండా పోతోంది.

## పంపిణీలో కుదరక.. పూర్తయ్యాక కనిపించక

భగత్‌నగర్ : జిల్లాలో రేషన్‌కార్డుదారుల ఈకేవైసీ నూరు శాతం పూర్తి చేయడానికి అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. దీనికోసం మండల తహసీల్దార్‌లను పర్యవేక్షకులుగా నియమించి త్వరితగతిన పూర్తి చేసేందుకు మార్గదర్శకాలు రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలో 3,13,138 రేషన్‌కార్డులుండగా అందులో 9,33,267 మంది లబ్ధిదారులు ఉన్నారు. ప్రభుత్వం ఇటీవల 36,230 కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేసింది. దీనిలో 1,28,673 మంది నూతన సభ్యులుగా చేరారు. కొత్తగా చేరినవారితోపాటు పాత సభ్యుల నుంచి ఈకేవైసీ పూర్తి చేయాల్సి ఉంది. కాగా జిల్లాలో ఇప్పటి వరకు 6,83,039 మంది లబ్ధిదారుల(73.19 శాతం) ఈకేవైసీ పూర్తయింది. ఇందులో కేశవపట్నం మండలంలో అత్యధికంగా 79.36 శాతం పూర్తవగా కరీంనగర్ అర్బన్‌లో 68.09 శాతం మాత్రమే అయింది.

**ఏం చేస్తారంటే..** ఈకేవైసీని వేగవంతం చేయడానికి మండల తహసీల్దార్‌లకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించనున్నారు. ఇన్నాళు రేషన్ డీలర్లు కోటా బియ్యం అయిపోగానే దుకాణం మూసివేసేవారు. ప్రస్తుతం ఈకేవైసీ కోసం దుకాణం తెరవాల్సి ఉంటుంది. దూర ప్రాంతాల్లోని వారిని సమీప దుకాణాల్లో, అనారోగ్యంతో మంచాన పడి ఉన్న వారి కోసం వారి ఇంటి వద్దే ఈకేవైసీ చేయించేందుకు ప్రణాళిక చేయనున్నారు.

**ప్రతిబంధకాలు ఇవీ..** రేషన్ దుకాణాల్లోని ఈపాస్ యంత్రాల్లో ఈకేవైసీ కాని సభ్యులను ఎరుపు గుర్తుతో చూపిస్తుండగా పూర్తయిన లబ్ధిదారులను ఆకుపచ్చ రంగులో చూపిస్తుంది. ఈకేవైసీ



చేయిద్దామంటే బియ్యం పంపిణీ సమయంలో కుదరదంటూ డీలర్లు వారి అభ్యర్థనను తిరస్కరిస్తున్నారు. దీంతోపాటు బియ్యం నిల్వలు నిండుకోగానే దుకాణం కట్టేస్తున్నారు. దీంతో లబ్ధిదారులు దుకాణాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. బియ్యం పంపిణీ సమయంలో ఈకేవైసీకి సమయం వెచ్చిస్తే వరుసలో ఉన్న లబ్ధిదారులు అభ్యంతరం చెబుతున్నారు. పాతరేషన్‌కార్డులోని లబ్ధిదారుల్లో పలువురు బతుకుదెరువు, ఉన్నత చదువు కోసం దూర ప్రాంతాలకు వెళ్లారు. ఆధార్‌కార్డులు నవీకరించుకోకపోవడం ఒక సమస్యగా మారింది. ఇలా పలు కారణాల తో పూర్తి స్థాయిలో ఈకేవైసీ పూర్తి కావడం లేదు.

## పండగ వేళ ఆదాయ కళ

సారంగాపూర్ : సాగు చేసిన పంట చేతికందే వరకు పెట్టుబడి అవసరాలకు ఇబ్బందులు లేకుండా అంతర పంటలు సాగు చేస్తూ పలువురు రైతులు ఆదర్శంగా నిలుస్తున్నారు. బీర్‌పూర్ మండలం చర్లపల్లికి చెందిన వేల్పుల రాజేశ్ తనకున్న 1.20 ఎకరాల్లో రెండేళ్ల కిందట ఆయిల్‌పాం సాగు చేశారు. పంట చేతికందే వరకు నాలుగేళ్లు పడుతుండటంతో అప్పటివరకు అంతర పంటలను సాగు చేస్తూ ఆదాయం సమకూర్చుకుంటున్నారు. గతేడాది తోటలో పత్తి, మిరప సాగు చేయగా ఈ ఏడాది 20 గుంటల విస్తీర్ణంతో బంతి, ఎకరా విస్తీర్ణంలో పత్తి వేశారు. బతుకమ్మ, దీపావళి, మల్లన్న బోనాలు తదితర పండగల సమయంలో బంతి పూలకు మంచి డిమాండ్ ఉంటుంది. ఇందుకు అనుగుణంగా ప్రస్తుతం పూలు చేతికందడంతో విక్రయాలు ప్రారంభించారు.



**పెట్టుబడి తక్కువ..**

పెట్టుబడి తక్కువ, ఆదాయం ఎక్కువగా ఉండేందుకు రాజేశ్ బంతి సాగును ఎంచుకున్నారు. మొక్కలను ఒక్కోదానికి రూ.5 చొప్పున 2 వేల మొక్కలను నర్సరీ నుంచి కొనుగోలు చేసి తెచ్చి నాటారు. దాదాపు రూ.20 వేల వరకు వెచ్చించారు. 50 కిలోల నుంచి క్వింటాలు వరకు దిగుబడి వస్తోంది. బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభం కావడంతో పూలకు మార్కెట్‌లో కిలోకు రూ.100 వరకు ఉండగా టోకుగా రూ.60 నుంచి రూ.80 వరకు అమ్ముతున్నారు. దీని ద్వారా ప్రతి కాతకు కనీసం 50 కిలోల దిగుబడికి రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు ఆదాయం రానుంది. మూడు నెలల పాటు తక్కువ పెట్టుబడితో రూ.లక్ష వరకు రాబడి రానుందని రాజేశ్ పేర్కొన్నారు.

## సార్వత్రికం.. మరింత పటిష్ఠం..!

ఖమ్మం : దూరవిద్య ద్వారా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎంతోమంది జీవితాల్లో వెలుగు నింపింది. వివిధ రకాల డిగ్రీ, పీజీ కోర్సులు అందించి అనేకమంది ఉన్నత విద్యావంతులుగా, ఉద్యోగాలు సాధించేందుకు కారణమైంది. విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అభ్యర్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. 'న్యాక్'లో మంచి గ్రేడ్ సాధించేందుకు కసరత్తు చేస్తోంది. కౌన్సెలర్ల నియామకానికి తాజాగా ప్రకటన ఇచ్చింది. ఖమ్మం, సత్తుపల్లి, మధిర, కొత్తగూడెం, భద్రాచలం, పాల్వంచ, ఇల్లెందులో అధ్యయన కేంద్రాలు ఉన్నాయి.

**వివిధ రకాల డిగ్రీ, పీజీ కోర్సులు**

ఖమ్మం అధ్యయన కేంద్రంలో మాత్రమే డిగ్రీ, పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇతర కేంద్రాల్లో డిగ్రీ కోర్సులు చదువుకోవచ్చు ఖమ్మం ప్రాంతీయ కేంద్రంలో డిగ్రీలో 1,800 మంది, పీజీలో 2వేల మంది అభ్యర్థులు దూరవిద్య అభ్యసిస్తున్నారు. ఇతర అధ్యయన కేంద్రాల్లో సగటున 250 మంది చదువుతున్నారు. ఈకేంద్రాల్లో ప్రతి ఆదివారం అభ్యర్థులకు ప్రత్యక్ష తరగతులు నిర్వహిస్తారు. ఆయా సబ్జెక్టులు బోధించేందుకు కొన్నేళ్లుగా పీజీ అర్హత ఉన్నవారు, ఉద్యోగ విరమణ పొందినవారు కౌన్సెలర్లుగా వ్యవహరించారు. ఏటా అవసరమైన సిబ్బందిని స్థానిక సమన్వయకర్తలు నియమించేవారు. ఈసారి అర్హతలను మార్చుతూ నోటిఫికేషన్‌ను విశ్వవిద్యాలయం విడుదల చేసింది. డిగ్రీలో పీరియడ్‌కు రూ.400, పీజీలో రూ.450 చొప్పున కౌన్సెలర్లకు చెల్లిస్తుంది.

**అర్హతల్లో మార్పులు..**

తాజా నోటిఫికేషన్ ప్రకారం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను విశ్వవిద్యాలయం ఆహ్వానించింది. ఈసారి పీజీతో పాటు పీహెచ్‌డీ, ఎంఫిల్, నెట్, సెట్ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యమివ్వాలని భావిస్తోంది. కొన్నేళ్లుగా పనిచేస్తున్న కౌన్సెలర్లను దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. విశ్వవిద్యాలయం 'న్యాక్'కు వెళ్తున్నందున ఉన్నత విద్యావంతులను కౌన్సెలర్లుగా తీసుకోవాలని యోచిస్తున్నట్లు సమాచారం. 'అభ్యర్థులకు మెరుగైన విద్యనందించటమే లక్ష్యంగా విశ్వవిద్యాలయం సంస్కరణలు తీసుకొస్తుంది' అని ఖమ్మం ప్రాంతీయ అధ్యయన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ వీరన్నకు తెలిపారు.

## మణుగూరు ఠాణాకు అవినీతి మరక..!

మణుగూరు : మణుగూరు పోలీస్ స్టేషన్ అవినీతికి అడ్డాగా మారింది. ఏప్రిల్‌లో ఓ భూవివాదంపై కేసు నమోదు చేయకుండా మధ్యవర్తి ద్వారా నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు సీఐ పట్టుబడ్డాడు. తాజాగా ఓ వ్యక్తికి స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు నగదు డిమాండ్ చేసిన క్రమంలో ఎస్సై బత్తిని రంజిత్ ఏసీబీ వలకు శుక్రవారం చిక్కాడు. ఐదు నెలల వ్యవధిలో మణుగూరు ఠాణాలో అవినీతి నిరోధక శాఖ(అనిశా) కేసులు రెండు నమోదవటం గమనార్హం. పోలీసు అధికారులే లంచావతారులుగా మారటంతో మణుగూరు ఠాణా ప్రతిష్ఠ మసకబారుతోంది.

**కొరవడిన పర్యవేక్షణ**

మణుగూరు పోలీస్ స్టేషన్ ఎస్సై, సీఐగా పోస్టింగ్‌లు దక్కించుకునేం దుకు ఎంతోమంది ఆసక్తి కనబరుస్తుంటారు. ఇందుకోసం పలువురు పైరవీలు



చేస్తుంటారు. పారిశ్రామిక ప్రాంతమవటం, ఇసుక క్వారీలు ఉండటం, ఆర్థిక వనరులకు ఢోకా లేకపోవటం వల్ల ఇక్కడ కొలువు చేయాలని ఉబలాటపడుతుంటారు. మణుగూరు ఠాణాపై పోలీసు ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటం వల్లే అధికారులు లంచావతారం ఎత్తుతున్నారనే వాదనలూ వ్యక్తమవుతున్నాయి.

**ప్రజల్లో పెరిగిన చైతన్యం**

లంచాలు అడిగే ఉద్యోగులపై ఏసీబీకి ఫిర్యాదు చేయాలనే అంశంపై ప్రజల్లో చైతన్యం పెరిగింది. ఏమాత్రం విశ్వసనీయమైన సమాచారం అందినా అనిశా అధికారులు దాడులు చేసి వణుకు పుట్టిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం అడిగితే తమకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. టోల్‌ఫ్రీ నంబర్ 1064ను సంప్రదించాలని చెబుతున్నారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఏసీబీ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

## కారు ఖరారు.. కాంగ్రెస్‌లో ఎవరు?




హైదరాబాద్ : రాష్ట్రంలో చర్చనీయాంశమైన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక గడువు సమీపిస్తోంది. వచ్చే డిసెంబరు 8వతేదీ లోగా ఉప ఎన్నిక నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తోంది. ఈనెల 30న ఓటర్ల తుది జాబితా ప్రకటించనున్నారు. ఇప్పటికే అభ్యంతరాలు స్వీకరించి దరఖాస్తుల పరిశీలన జరుపుతున్నారు. కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ పోలింగ్‌కు ఒక్క రోజు ముందు వరకు జరుగుతుందని అధికారులు వెల్లడించారు. మరోవైపు రాజకీయ పార్టీలూ సిద్ధమవుతున్నాయి. ప్రతిపక్షం భారాస అభ్యర్థిని ప్రకటించింది. ముందుగా ఊహించినట్లే దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ భార్య సునీతను అభ్యర్థిగా అధికారికంగా పార్టీ ప్రకటించింది. ప్రచారంలోకి దిగేందుకు సన్నాహాలు చేస్తోంది.

**అధికార పార్టీ ప్రత్యేక దృష్టి..**

భారాస తమ అభ్యర్థిగా మాగంటి సునీతను ప్రకటించడంతో కాంగ్రెస్ పార్టీలో ఆశావహుల్లో కలకలం ప్రారంభమైంది. కాంగ్రెస్ అభ్యర్థిని త్వరగా ప్రకటించాలనే ఒత్తిడి పెరిగింది. బీసీ అభ్యర్థికే అవకాశాలు ఉన్నట్లు పార్టీ వర్గాలు సూచన ప్రాయంగా వెల్లడించాయి. ప్రస్తుతం కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనే దానిపై ఉత్కంఠ నెలకొంది. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన అజారుద్దీన్‌కు అధిష్ఠానం ఎమ్మెల్సీ పదవి ఖరారు చేయడంతో ఆయన పోటీ నుంచి తప్పుకున్నట్లే. ప్రస్తుతం మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, మరో నేత నియోజకవర్గ పార్టీ ఇంఛార్జి నవీన్‌కుమార్‌యాదవ్ తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. మరికొంతమంది ఉన్నా.. ఈ రెండు పేర్లకే ప్రాధాన్యం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. భాజపా సహా ఇతర పార్టీలేవీ తమ అభ్యర్థులను ప్రకటించలేదు.

నియోజకవర్గం: జూబ్లీహిల్స్
మహిళలు 1,88,356
పురుషులు: 2,04,288
మొత్తం ఓటర్లు 3,92,669
ఇతరులు 25
పోలింగ్ కేంద్రాలు 408
ఓటర్ల జాబితా సవరణ
కొత్త దరఖాస్తులు 8,000
ఓటు నమోదుకు 6,500
మార్పులు చేర్పులు 1,500
తుది జాబితా ఈ నెల 30వరకు

## ఒత్తిడిలోంచి.. ప్రకృతి ఒడిలోకి..



హైదరాబాద్ : మహానగరం చెంతన ప్రకృతి లోగిళ్లు ఆహ్వానం పలుకుతున్నాయి. కుటుంబ సభ్యులతో గడిపేందుకు అనువుగా హెచ్‌ఎండీఏ పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేసింది. రానున్న రోజుల్లో మరిన్ని ప్రకృతి వనాలను సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం దసరా సెలవులు కావడంతో శివారులో ఉన్న అందమైన ప్రకృతి వనాలను సందర్శించి వద్దాం..

**సిద్ధమైన ఏకో పార్కు.. పక్షి అక్వేరియం**

ఒకవైపు అవుటర్ రింగ్‌రోడ్డు.. పక్కనే హిమాయత్‌సాగర్.. దానికి ఆనుకొని అందమైన ఉద్యానవనం. 85 ఎకరాల్లో ఏకో పార్కును తీర్చిదిద్దారు. త్వరలో ప్రారంభించనున్నారు. ఆరు ఎకరాల్లో పక్షుల ప్రదర్శనశాల సిద్ధమైంది. దేశంలోని అరుదైన రకాలతోపాటు పెరూ, ఆస్ట్రేలియా, అర్జెంటీనా, అమెరికా, న్యూజిలాండ్, జపాన్, చైనా దేశాల్లో కనిపించే అందమైన పక్షి రకాలను ఇక్కడ చూసే అవకాశం ఉంది.

**నాగారం.. సుందరం..**

మహేశ్వరం మండలంలోని నాగారం వద్ద 556.69 హెక్టార్లలో ఈ అర్బన్ ఫారెస్టు పార్కు తీర్చిదిద్దారు. అవుటర్ రింగ్ రోడ్డులో పెద్ద గోల్కొండ(ఎక్సెట్ నెంబరు-15) వద్ద కిందకు దిగితే ఈ పార్కులోకి వెళ్లవచ్చు. సఫారీ ట్రాక్, ఎటు చూసినా పెద్ద పెద్ద చెట్లు..పక్షుల కిలకిలరావాలతో ఈ అర్బన్ ఫారెస్టు కనువిందు చేస్తోంది.

**అటు జలాశయం.. ఇటు సుందరవనం**

గండిపేట జలాశయం వద్ద సుందర ఉద్యానం నగరవాసులను అలరిస్తోంది. ఈ ల్యాండ్‌స్కేప్ పార్కును రూ.35.60 కోట్ల వ్యయంతో తీర్చిదిద్దారు. వాక్ వేలు, ఆర్ట్ పెవిలియన్, ఫ్లవర్ టెర్రాస్, పిక్‌నిక్ స్పాట్‌లు, ఓపెన్ ఎయిర్ థియేటర్, కిడ్స్ ప్లే ఏరియా, ఫుడ్ కోర్టులు అందుబాటులోకి వచ్చాయి.

**పల్లెగడ్డ.. ఆహ్లాదానికి అడ్డా..**

మహేశ్వరంలోనే హర్షగూడ గ్రామానికి సమీపంలో 87 ఎకరాల్లో ఈ పార్కును అభివృద్ధి చేశారు. అవుటర్ రింగ్ రోడ్డులోని తుక్కుగూడ వద్ద (ఎగ్జిట్ నంబరు-14) నుంచి ఈ పార్కుకు చేరుకోవచ్చు. పచ్చదనంతో పార్కు అందాలు ఆకట్టుకుంటున్నాయి

**అందాల.. మన్యంకంచ**

కందుకూర్ మండలం లేమూర్‌లో మన్యంకంచ పార్కు 58.78 హెక్టార్లలో రూపుదిద్దుకుంది. అవుటర్‌లోని తుక్కుగూడ వద్ద ఎగ్జిట్ 14 నుంచి ఈ పార్కుకు చేరుకోవచ్చు.

**సిరిగిరిపూర్ అటవీ పార్కు..**

అవుటర్ ఎక్సిట్-14 (తుక్కుగూడ) సమీపంలోనే ఈ పార్కును అభివృద్ధి చేశారు. సఫారీ ట్రాక్, విజిటర్స్ పాత్‌వే ఇతర మౌలిక వసతులు కల్పించారు. రకరకాల పక్షులు కనువిందు చేస్తాయి.

## శివారు.. బేజారు



కరీంనగర్ : జిల్లాలో కరీంనగర్ నగరపాలక సంస్థతోపాటు హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి మున్సిపాలిటీల పరిధిలోని ఖాళీ స్థలాలు దుర్గంధానికి నిలయాలుగా మారాయి. ఇళ్ల మధ్య ఉండటంతో పారిశుద్ధ్య పనులకు విఘాతం కలుగుతుండగా వాటిని శుభ్రం చేసుకోవడానికి స్థల యజమానులు ముందుకు రావడం లేదు. నగరంలో అయితే వందల సంఖ్యలో ఖాళీ స్థలాలున్నాయి. మురుగు, వర్షం నీరు నిలిచి దోమలకు ఆవాసంగా తయారైంది. పిచ్చి మొక్కలు, చెత్తా చెదారంతో నిండి దుర్వాసన వెదజల్లుతోంది. కొన్ని చోట్ల ఇవి చెరువులను తలపిస్తున్నాయి.

**ఇక్కడ అధికం..**

నగరంలోని శివారు, విలీన గ్రామాల్లో ఎక్కువగా ఖాళీ స్థలాలు ఉన్నాయి. అలకాపురి కాలనీ, కోతిరాంపూర్, పోచమ్మవాడ, ఆటోనగర్, లక్ష్మీనగర్, గాయత్రీనగర్, వావిలాలపల్లి, ఆదర్శనగర్, హుస్సేనీపుర, కిసాన్‌నగర్, కుర్మవాడ, సంతోష్‌నగర్, భగత్‌నగర్, సప్తగిరికాలనీ, మెహర్‌నగర్, పద్మనగర్, శ్రీహరినగర్, కొత్తయాస్వాడ, రేకుర్తి, బొమ్మకల్, గణేశ్‌నగర్, హనుమాన్‌నగర్, మారుతీనగర్, రాంచంద్రాపూర్, వాసుదేవకాలనీ, టీఎన్‌జీవోఎస్, ఆర్టీసీ కాలనీ, సుభాష్‌నగర్, తీగలగుట్టపల్లి, సీతారాంపూర్ తదితర ప్రాంతాల్లో అధికంగా ఉన్నాయి. ఇక్కడ ఖాళీ జాగాలను కొనుగోలు చేస్తున్న యజమానులు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. ఎక్కువ శాతం విదేశాలకు వెళ్లిన వారే వీటిని కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు. అపరిశుభ్రంగా ఉండటంతో శానిటేషన్ కార్మికులే శుభ్రం చేయాలనే డిమాండ్ స్థానికుల నుంచి వ్యక్తమవుతోంది.

**పట్టని నోటీసులు**

ఖాళీ స్థలాల విషయంలో నగరపాలక సంస్థ పట్టింపు లేకుండా వ్యవహరిస్తోంది. తెలంగాణ మున్సిపాలిటీల చట్టం-2019 సెక్షన్ 161(1) ప్రకారం చర్యలు తీసుకునే వీలున్నా నిర్లక్ష్యం వీడటం లేదు. నోటీసులు జారీ చేయాలని కమిషనర్ ఆదేశించినా ఆ దిశగా టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ అధికారులు పట్టనట్లు ఉంటున్నారు.

**పేరుకే హెచ్చరిక బోర్డులు**

ఖాళీ స్థలాలు శుభ్రం చేసుకోవాలని నగరపాలక సంస్థ గతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసింది. ఆ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆ సూచికలు నామమాత్రంగా మారి వాటికి వెచ్చించిన వ్యయం వృథా అయింది.

గతంలో కొందరికి రూ.10 వేల జరిమానా విధించగా ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాళీ స్థలాలను గుర్తించి శుభ్రం చేసుకునేలా యజమానిని ఒప్పిస్తే ప్రయోజనం ఉంటుంది.

## ఇక్కడ వృథా.. అక్కడ వ్యథ

కోదాడ : తుంగతుర్తి చెరువు అలుగు ఇది. దాని మీది నుంచి నీరు వృథాగా పారుతోంది. ఈ ప్రాంతంలో వానలు ఈ ఏడాది రాకపోయినా అలుగు పోస్తుందంటే ఎస్సారెస్పీ కాల్వ పుణ్యమే. కాల్వల మీద తూములు మూయకపోవడంతో నీరంతా ఇలా కిందికి పోయి చెరువులు అలుగు పోస్తున్నాయి.నీరు లేక కాల్వల్లో గడ్డి మొలిచి కనిపిస్తున్న ఈ ప్రాంతం మునగాల మండల పరిధిలోనిది. చివరి ఆయకట్టు వరకు ఎస్సారెస్పీ నీరు రావట్లేదు అనడానికి ఈ చిత్రమే నిదర్శనం. ఇలా కోదాడ, సూర్యాపేట నియోజకవర్గాల్లో 90 శాతం కాల్వలకు నీరు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ఎస్సారెస్పీ కాల్వలపై అధికారుల పర్యవేక్షణ కొరవడి నీరంతా వృథా అవుతోంది. ఫలితంగా చివరి వరకు నీరందక రైతులు బోర్లు, బావులు తవ్వుకొని ఆర్థికంగా నష్టపోతున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు దృష్టిసారిస్తే నీటి వృథాను అరికట్టవచ్చు. వారు నిర్లక్ష్యం వహిస్తుండటంతో ఎస్సారెస్పీ చివరి ఆయకట్టుకు నీరు వెళ్లని దుస్థితి నెలకొంది. జిల్లాలో ఎన్నెస్పీ తర్వాత, ఎస్సారెస్పీ మీదనే ఎక్కువగా వరి సాగవుతోంది. ఎన్నెస్పీ పరిధిలో నీరు పుష్కలంగా చివరి ఆయకట్టు వరకు వెళుతుంటే, ఎస్సారెస్పీ పరిధిలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

**సూర్యాపేట, కోదాడకు చేరని నీరు..**

ఎస్సారెస్పీ పరిధిలో కోదాడ, సూర్యాపేట నియోజకవర్గాల్లో సుమారు రెండు లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. తుంగతుర్తి నియోజకవర్గంలో



ప్రధాన కాల్వలకు ఉన్న తూములు ఇష్టారాజ్యంగా తెరుస్తుండటంతో రెండు నియోజకవర్గాలకు నీరు రావట్లేదు. తూములు సకాలంలో మూయట్లేదు. దీంతో నీరు పంట పొలాల మీదుగా సమీపంలోని చెరువుల్లోకి వెళ్తుంది. దీంతో నీటి కొరత ఏర్పడుతుంది. తుంగతుర్తి నియోజకవర్గానికి మాత్రమే నీరు అందుతుండగా, మిగతా ప్రాంతాల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు.

**క్షేత్ర స్థాయిలో పరిశీలించి అరికడతాం: సత్యనారాయణ, ఇన్‌ఛార్జి ఎస్సారెస్పీ ఈఈ, తుంగతుర్తి**

నియోజకవర్గంలో కాల్వల మీద నీరు వృథా అవుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. క్షేత్రస్థాయిలో పరిశీలించి వృథా వెళుతున్న ప్రాంతాలను గుర్తించి, తూములు మూయిస్తాం. సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాలకు నీరు అందేలా చూస్తాం.

**అచ్చులు కట్టి నష్టపోయాం: నరేశ్ రైతు, తాడువాయి, మునగాల మండలం**

గతంలో పత్తి పంట సాగు చేశాం. రెండేళ్ల క్రితం కాల్వల్లో నీరు రావడంతో అచ్చు కట్టి వరి సాగు చేశాం. ఇప్పుడు నీరు రాకపోవడంతో అచ్చు కట్టిన భూమిలో మిగతా పంటలు పండించలేని దుస్థితి. నీటి కోసం బోర్లు వేసి ఆర్థికంగా నష్టపోయాం.

## మన ఖ్యాతి.. విశ్వవ్యాప్తి

మిర్యాలగూడ : చారిత్రక, ఆధ్యాత్మిక, పర్యాటక ప్రదేశాలకు ఉమ్మడి జిల్లా పెట్టింది పేరు. పురాతన ఆలయాలు, నిర్మాణాలు, ఆధునిక కట్టడాలు కనువిందు చేస్తున్నాయి. ఏటా వందలాది మంది విదేశీ పర్యాటకులతో పాటు..లక్షలాది మంది దేశీయ సందర్శకులు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రదేశాలను సందర్శిస్తూ మంత్ర ముగ్ధులవుతున్నారు. ఇటీవల మిస్ వరల్డ్ పోటీదారులు సైతం పలు ప్రదేశాలను సందర్శించారు. నేడు 'ప్రపంచ పర్యాటక దినోత్సవం' సందర్భంగా కథనం. కట్టిపడేసే సాగర్ కట్టడాలు

దేశంలోనే అతిపెద్ద ఆనకట్టల్లో ఒకటైన నాగార్జునసాగర్ డ్యామ్ ఉమ్మడి జిల్లాలో ఉండడం విశేషం. ఈ ప్రాంతంలో జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండ, దానిపై ఉన్న పురావస్తు ప్రదర్శనశాల ఆకట్టుకుంటాయి. ఇక ఇటీవల ప్రతిష్ఠాత్మకంగా అంతర్జాతీయ స్థాయిలో నిర్మించిన బుద్ధవనం దేశ విదేశాల పర్యాటకులను విపరీతంగా ఆకట్టుకుంటుంది. సాగర్‌కు సమీప ఎత్తిపోతల జలపాతం, అనుపు, లాంచీ ప్రయాణం సైతం పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. మిస్ వరల్డ్ పోటీదారులు ఇటీవల బుద్ధవనాన్ని సందర్శించి సందడి చేశారు. చైనా, శ్రీలంక, టిబెట్, నేపాల్ తదితర దేశాలకు చెందిన బౌద్ధ మతస్థులు, యాత్రికులు వందల సంఖ్యలో సందర్శిస్తుంటారు. ఆలేరు మండలం కొలనుపాక జైన దేవాలయంతో పాటు..భువనగిరి కోటను సైతం అనేక మంది సందర్శిస్తుంటారు. జైన ఆలయాన్ని ఆధ్యాత్మిక, చారిత్రక, ఆర్కిటెక్చర్ రంగాల విదేశీ యాత్రికులు తరలివస్తుంటారు.

**ఆలయ విశిష్టత అద్భుతం**

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పునర్నిర్మించిన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. పురాతన ఆలయంతో పాటు కట్టడాలు భక్తులను, పర్యాటకులను సైతం



అబ్బురపరుస్తున్నాయి. మిస్ వరల్డ్ పోటీదారులు సైతం ఆలయాన్ని సందర్శించి పరవశించి పోయారు. ఇటీవల కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఆలయం గొప్పతనాన్ని అభినందించారు. గతేడాది మిస్ వరల్డ్ క్రిస్టినా పిజ్కోవా సైతం ఆలయాన్ని సందర్శించారు. ఇటీవల జింబాబ్వే, నైజీరియాకు చెందిన ప్రతినిధులు ఆలయానికి వచ్చారు. ఏటా 150 మందికి పైగా విదేశీయులు గుట్ట ఆలయం, పరిసరాలను సందర్శిస్తున్నారు.

**పేరుగాంచిన పోచంపల్లి**

ప్రపంచ పర్యాటక గ్రామంగా పేరుగాంచిన భూదాన్ పోచంపల్లి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. 2021లో యునైటెడ్ నేషన్స్ వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్ పోచంపల్లిని ఉత్తమ పర్యాటక గ్రామంగా ఎంపిక చేయడంతో.. గ్రామ ప్రత్యేకత ప్రపంచానికి తెలిసింది. అనేక పురాతన, అధునాతన వస్త్రాలకు ప్రసిద్ధి చెందిన గ్రామాన్ని ఇటీవల మిస్ వరల్డ్ పోటీదారులు సైతం సందర్శించారు. ఏటా పదుల సంఖ్యలో విదేశీ పర్యాటకులు గ్రామానికి వస్తుంటారు.

# పక్కాగా.. పంట లెక్క

రాజపేట: జిల్లాలో ప్రారంభమైన డిజిటల్ క్రాప్ సర్వేలో వ్యవసాయ విస్తరణ అధికారులు పూర్తిగా నిమగ్నమయ్యారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం నిర్వహిస్తున్న ఈ సర్వేలో ఎటువంటి అవకతవకలు, తప్పులు లేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు ఉన్నతస్థాయి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ విషయమై వ్యవసాయ శాఖ డైరెక్టర్ సర్వే ప్రక్రియ నిత్యం సమీక్షిస్తున్నారు. గతేడాది సర్వే అరకొరగా నిర్వహించగా, ఈ ఏడాది వందశాతం పంటల నమోదు తప్పులు లేకుండా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ విషయమై సర్వే కోసం వచ్చే ఏఈవోలకు రైతులు సహకరించి, విధిగా పంటల వివరాలు నమోదు చేయించుకోవాలని యాదగిరిగుట్ట ఏడీఏ శాంతినిర్మలతో వెల్లడించారు.

**ప్రధాన ఉద్దేశం ఇదీ..**

దేశంలో ఏ పంటకు ఎంత దిగుబడి వస్తుందో తెలుసుకోవచ్చు. దిగుబడికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. మద్దతు ధర నిర్ణయిస్తారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో కచ్చితత్వంతో నష్ట నిర్ధారణ, చీడపీడల ఉనికి, తగిన విధంగా రైతులు తీసుకోవాల్సిన యాజమాన్య చర్యలపై సంసిద్ధతకు అవకాశం ఉంటుంది. వ్యవసాయ పురోగతి అంచనాకు ఈ సర్వే దోహద పడుతుంది. అయితే క్రాప్ బుకింగ్ 90 శాతం పూర్తికాగానే రైతులకు సంక్షిప్త సమాచారం ద్వారా వివరాలు పంపిస్తారు. రైతు వివరాలు ప్రతి గ్రామ పంచాయతీలో ప్రదర్శించాలి. నమోదులో తప్పులు దొర్లితే సరిచేసేందుకు రైతులు దరఖాస్తు చేసుకోవాలి. ఏఈవో మూడు రోజుల్లో సరిచేసి తుది జాబితా ప్రదర్శించడానికి అవకాశం ఉంటుంది.

జిల్లా సమాచారం.. (ఎకరాల్లో)



సాగు యోగ్యమైన భూమి : 6.15 లక్షలు
ఆయా పంటలు సాగు చేపడుతుంది : 4.5 లక్షలు
రైతుల సంఖ్య : 2.28 లక్షలు
వానా కాలంలో సాగు అంచనా : 2,95,000
ప్రస్తుతం సాగు చేసింది : 68 శాతం

**సర్వే క్రమం ఇలా..**

ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి తమ క్లస్టర్ పరిధిలోని రైతులను ప్రత్యక్షంగా కలిసి వాస్తవంగా సాగులో ఉన్న పంటల వివరాలు నమోదు చేయాలి. మహిళా ఏఈవోలు కనీసం 1800 ఎకరాలు, ఇతర ఏఈవోలు 2 వేల ఎకరాల్లో డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహిస్తారు. మిగిలిన వాటిని సాధారణ క్రాప్ బుకింగ్ పద్ధతిలో చేస్తారు.

ప్రతి పంటను ఫొటో తీసి మొబైల్ యాప్‌లో పంట పూర్తి వివరాలు అప్‌లోడ్ చేయడం తప్పనిసరి.

సర్వేలో వరి రకాలను పేర్కొనడం తప్పనిసరి. ఇది ధాన్యం కొనుగోలు చేసే సమయంలో ఉపయోగపడుతుంది.

స్వల్ప కాలిక పంట రకాలైన మినుము, పెసర, మొక్కజొన్న వంటి వాటిని ముందుగా నమోదు చేయాలి.

పట్టాదారు పాసుపుస్తకం లేని, దేవాదాయ, ఇతర భూముల్లో సాగు చేసే పంటలను రైతు పేరు, ఆధార్, చరవాణి నెంబరు మొదలైన వివరాలతో నమోదు చేస్తారు.

# నీటి మీటర్లతో చుక్కలు

హైదరాబాద్ : నగరానికి తాగునీటిని సరఫరా చేసే జలమండలిలో వాటర్ మీటర్ల ప్రక్రియ ప్రహసనంగా మారింది. మీటర్లు పనిచేయకుంటే బిల్లులను రెట్టింపు, మూడు రెట్లు బాదేస్తున్నారు. 14.07 లక్షల కనెక్షన్లు ఉన్నా సగం కనెక్షన్ల మీటర్లు పని చేయడం లేదని సమాచారం. గ్రీన్‌బ్రిగేడ్ కాంట్రాక్టర్లు, విక్రయ సంస్థలు, రీడర్ల ఇష్టారాజ్యం నడుస్తోంది. బల్క్ కనెక్షన్లకు బిగించిన ఆటోమెటిక్ మీటర్లు పనిచేయక ప్రతినెలా సగటు అంచనాల మేరకు బిల్లింగ్ చేయాల్సి వస్తుంది. దీంతో జలమండలితోపాటు వినియోగదారులకూ నష్టం వాటిల్లుతోంది.

**ఫిర్యాదు చేసినా..**

మీటరు పనిచేయకపోతే మార్చుకోవడానికీ ఇక్కట్లు తప్పడం లేదు. అధికారులను సంప్రదిస్తే మీటరు మార్పు బాధ్యత మీదేనని చెబుతున్నారు. ఒక వినియోగదారుడి ఇంట్లో జనవరి నుంచి మీటరు పనిచేయడం లేదు. మార్చాలని జలమండలి కార్యాలయం చుట్టూ తిరగడమే కాకుండా ఆన్‌లైన్‌లో 30 సార్లు ఫిర్యాదు చేసినా ఇప్పటికీ స్పందన లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**పరిష్కరించినట్లు సందేశాలు**

మీటరు పనిచేయడం లేదని ఆన్‌లైన్‌లో జలమండలికి ఉదయం ఫిర్యాదు చేస్తే సాయంత్రానికి సమస్య పరిష్కరించినట్లు వినియోగదారు చరవాణికి మెసేజ్‌లు మాత్రం వస్తున్నాయి. పరిష్కరించకుండానే ఇలా



సందేశాలు పంపడంతో వినియోగదారులు తలలు పట్టుకుంటున్నారు. తాము ఉచిత నీటి పథకం పరిధిలో ఉన్నా పనిచేయని మీటర్ల కారణంగా బిల్లులు చెల్లించాల్సి వస్తోందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఓ కొత్త కనెక్షన్ కథ ఇది**

అమీన్‌పూర్‌లో కొత్త నల్లా కనెక్షన్‌కు మీటరు కోసం జూన్‌లో జలమండలి రూ.37 వేలు వసూలు చేసింది. కనెక్షన్ ఇచ్చేటపుడు మీటరు ఏర్పాటుకు మరో రూ.8వేలు చెల్లించాలని గ్రీన్‌బ్రిగేడ్ కాంట్రాక్టర్ వసూలు చేశారు. నెలలోపే పాడైంది. ఏడాది గ్యారంటీ ఉన్నందున మార్చాలని ఒత్తిడి చేస్తే కొత్తది ఏర్పాటు చేశారు. అదీ మొరాయించింది. చివరకు కొత్త మీటరు బిగించుకోవాల్సి వచ్చిందని వినియోగదారు వాపోయారు.

# పర్యవేక్షణ లోపం.. పనులు నాసిరకం



జగిత్యాల : వినాయక నిమజ్జన వేడుకల కోసం జగిత్యాల పట్టణంలో చేసిన పనుల్లో నాణ్యత లోపం స్పష్టంగా కనిపిస్తోంది. శుక్ర, శనివారాల్లో నిమజ్జనానికి సన్నాహాలు చేస్తున్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో పురపాలక సంఘం ఆధ్వర్యంలో రహదారులకు ఏటా తాత్కాలిక మరమ్మతులు నిర్వహిస్తున్నారు. ఈసారి బల్దియా రూ.24 లక్షలు కేటాయించింది. రోడ్లపై మొరంతో గుంతలు పూడ్చేందుకు రూ.5 లక్షలు, చెరువు కట్టపై క్రేన్ల కోసం రూ.5 లక్షలు, విద్యుత్తు సౌకర్యం, విద్యుత్తు దీపాల కోసం రూ.10 లక్షలు, కట్టపై వసతుల కల్పనకు రూ.4 లక్షలు కేటాయించారు. టెండరు ద్వారా పనులను గుత్తేదార్లకు అప్పగించారు.

**మొరం కాదు.. మట్టి**

రహదారులపై గుంతలను మొరంతో పాటు, సిమెంటు దుమ్ముతో పూడ్చాల్సి ఉండగా మట్టి వేసి చదును చేస్తున్నారు. అసలే బురదతో ఉన్న రోడ్లపై ఎర్ర మట్టి పోయడంతో మరింత అధ్వానంగా మారాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు నాసిరకంగా జరుగుతున్నాయి. ఆర్టీసీ డిపో, వైద్య కళాశాల, ఎల్‌జీ గార్డెన్, కొత్త బస్టాండు తదితర ప్రాంతాల్లో గుంతల సమస్య తీవ్రంగా ఉంది. ఈసారి చాలా వరకు పెద్ద పరిమాణంలోని వినాయక విగ్రహాలనే ఏర్పాటు చేశారు. బురద రోడ్లపై తరలించడానికి నిర్వాహకులకు ఇబ్బందులు తప్పేలా లేవు. పనుల తీరుపై 'న్యూస్‌టుడే' ఏఈ చరణ్‌తేజను వివరణ కోరగా గుంతల్లో మొరం మాత్రమే వస్తున్నారని, మట్టి ఉంటే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

నిమజ్జన ఏర్పాట్లకు సంబంధించిన పనుల టెండర్లలో అధికారులు నిబంధనలు పాటించలేదు.

గుత్తేదార్లతో కుమ్మక్కై కొన్ని పనులను గుత్తేదార్లకు అనుకూలంగా మార్చారు.

విద్యుత్తు దీపాలు, క్రేన్ల ఏర్పాట్లలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. అధికారుల క్షేత్ర స్థాయి పరిశీలన కొరవడటంతో గుత్తేదార్లు అరకొరగా పనులు చేపట్టారు.

గుత్తేదార్లు ప్రైవేటు వ్యక్తులలో చేపట్టాల్సిన పనులకు పురపాలక సిబ్బందిని వాడుకున్నారు.

# పట్టా పేర అనుమతి.. అటవీ భూమి చెరబట్టి



పెద్దపల్లి: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో మట్టి అవసరాలు పెరగడంతో అక్రమార్కులు అందినకాడికి దోచుకునేందుకు అక్రమ మైనింగ్‌కు తెరతీశారు. పట్టా భూమి పేరిట అనుమతులు పొంది అటవీ భూములను తవ్వేస్తున్నారు. రాత్రికి రాత్రే తవ్వకాలు జరిపి మట్టిని తరలిస్తున్నారు. క్షేత్రస్థాయిలో అటవీ శాఖ సిబ్బంది సహకారంతోనే ఈ అక్రమ దందా యథేచ్ఛగా సాగుతుందన్న ఆరోపణలున్నాయి. కొన్ని రోజులుగా సాగుతున్న మట్టి అక్రమ రవాణాపై రెవెన్యూ, అటవీశాఖ అధికారులు ప్రేక్షకపాత్ర పోషించడంతో మట్టిదందా మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతుంది.

**ఇటుక బట్టీలకు వరం..**

పెద్దపల్లి మండలంలోని గౌరెడ్డిపేట గ్రామంలో పట్టా భూములలో మట్టి తవ్వకాలకు అనుమతులు పొందారు. కానీ తవ్వకాలు పట్టా భూములను వదిలేసి అటవీ భూముల వరకు సాగుతుంది. పట్టా భూములలో అనుమతించిన మైనింగ్ అధికారులు హద్దులు నిర్ణయించకపోవడంతో తవ్వకాలు గుట్టలవైపు వెళ్తున్నాయి. ఈ తవ్వకాలు ఇటుక బట్టీల నిర్వాహకులకు వరంగా మారుతున్నాయి. ఎగుడుదిగుడుగా ఉన్న గుట్టలను తవ్వడంతో నేల సమాంతరంగా మారుతుంది. ఈ స్థలాన్ని బట్టీల నిర్వాహకులు వినియోగించుకునేందుకు ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలు పెట్టారు. మట్టి తవ్వకాలకు అనుమతి పొందిన పట్టాదారులతో ఒప్పందాలు చేసుకుంటున్నారు.

**అధికారి ఏమన్నారంటే..**

జిల్లాలో జరుగుతున్న తవ్వకాలపై జిల్లా మైనింగ్ అధికారి శ్రీనివాస్‌ను సంప్రదించగా గౌరెడ్డిపేటలో పట్టా భూములలో 2.64 హెక్టార్లలో మాత్రమే అనుమతించామని, ముత్తారం మండలం పారుపల్లిలో ప్రభుత్వ భూమిలో అక్రమ మైనింగ్ చేస్తున్న యంత్రాలను సీజ్ చేసినట్లు చెప్పారు. **పెరిగిన అవసరాలతో..** గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం మట్టి వినియోగం పెరగడంతో పలు గ్రామాల్లో అనధికారిక క్వారీలు ఏర్పడుతున్నాయి. గత నెలలో తుర్కలమద్దికుంటలో వెలుగులోకిరాగా.. తాజాగా జిల్లాలోని ప్రతి మూడు గ్రామాలకు ఒక క్వారీ చొప్పున పెరిగిపోయాయి. పెద్దపల్లి, పాలకుర్తి, కాల్వశ్రీరాంపూర్, ముత్తారం, ధర్మారం, జూలపల్లి మండలాల్లోని గుట్ట ప్రాంతాల్లోనే ఈ తవ్వకాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

# ముంచిన వరద.. తెగుళ్ల బెడద



జగిత్యాల: జిల్లాలో ఇటీవలి వర్షాలకు దెబ్బతిన్న పైర్లను చూసి రైతులు ఆవేదన చెందుతున్నారు. వరదలకు కొట్టుకుపోగా మిగిలిన పంటలకు చీడపీడలు, తెగుళ్ల బెడద పెరిగిందని వాపోతున్నారు. మొత్తం 7 మండలాల పరిధిలోని 35 గ్రామాల్లో 2,540 మంది రైతులకు చెందిన దాదాపు 2,963 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో 2,029 ఎకరాల్లో వరి, 222 ఎకరాల్లో పత్తి, 342 ఎకరాల్లో మొక్కజొన్న, 65 ఎకరాల్లో సోయాబీన్, 305 ఎకరాల్లో ఉద్యాన పంటలకు 33 శాతం కంటే ఎక్కువ నష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారులు గుర్తించారు. వాస్తవ నష్టం ఇంతకంటే ఎక్కువగా ఉంటుంది. తక్కువ దెబ్బతిన్న పంటల్లో వర్షాలతో చీడపీడలు వ్యాప్తి చెందాయి. పత్తిలో వడలు తెగులు వ్యాప్తి చెంది మొక్కలు నిలువునా ఎండిపోయాయి. వరిలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు, సన్నగింజ రకాల్లో సుడి దోమలు వ్యాపిస్తున్నాయి. పసుపులో దుంపకుళ్లు, మర్రాకు తెగులు, ఇతర పంటల్లోనూ తెగుళ్ల తీవ్రత పెరిగినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు.

**అమలుకు నోచని బీమా పథకం**

తాము అధికారంలోకి వచ్చాక పూర్తి ప్రీమియం తామే చెల్లించి పంటల బీమా అమలు చేస్తామని గత ఎన్నికలకు ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చింది. 2023 డిసెంబరులో ఆ పార్టీ అధికారం చేపట్టగా 2023–24 యాసంగి, 2024–25 వానాకాలం, యాసంగి సీజన్లు గడిచిపోయాయి. ప్రస్తుత 2025 వానాకాలం సీజన్‌కు పంటల సాగుకు అదను దాటినా ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమాను అమలు చేయడం లేదు. జిల్లాలో గతంలో వరి, పత్తి, మిరప, మామిడి, వేరుశనగ తదితర 8 రకాల పంటలకు పథకాన్ని అమలు చేశారు. వచ్చే యాసంగి సీజన్ నుంచైనా పునరుద్ధరిస్తే రైతులకు మేలు జరుగుతుంది.

**పది సీజన్లుగా అందని పరిహారం**

2020 వానాకాలంలో అధిక వర్షాలతో జిల్లాలో 10,900 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. బాధిత రైతులకు 3 నెలల్లోపు పెట్టుబడి రాయితీ(పంట నష్ట పరిహారం), 4 నెలల్లోపు పంటల బీమా పరిహారం చెల్లించాలని 2021 సెప్టెంబరు 28న రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అయినా ఒక్క రైతుకూ పరిహారం అందలేదు.

2021 వానాకాలంలో అధిక వర్షాలతో 30 వేల ఎకరాల్లో, 2021–2022 యాసంగిలో వడగండ్లతో 12 వేల ఎకరాల్లో పంటలను రైతులు నష్టపోయారు.

2022 వానాకాలంలో 22,993 ఎకరాల్లో ఆరుతడి పంటలు, 4,130 ఎకరాల్లో వరి పైర్లు దెబ్బతిన్నాయి. 2023 వానాకాలంలో భారీ వర్షానికి 15,487 ఎకరాల్లో అన్నిరకాల పంటలకు నష్టం వాటిల్లినా పరిహారం ఇవ్వలేదు. 2023 యాసంగిలో 26,199 ఎకరాల్లో పంటలు దెబ్బతింటే కేవలం 532 ఎకరాలకు మాత్రమే ఎకరానికి రూ.10 వేల చొప్పున అందజేశారు.

2024–25 వానాకాలం, యాసంగి సీజన్లలో దెబ్బతిన్న 12,943 ఎకరాల పంటలకు పరిహారం రాలేదు. ప్రస్తుతం దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇచ్చేలా రైతువారీగా సర్వే నిర్వహించాల్సి ఉంది.

# సాగుకు ఊతం.. ఉపాధితో లాభం

చేగుంట: గ్రామాల్లో వలసలను నివారించి స్థానికంగానే ఉపాధి కల్పించాలనే ఉద్దేశంలో కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. కాలానుగుణంగా నూతన పనులను చేరుస్తున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో చెరువులు, కుంటలు, కాలువలు, మొక్కల పెంపకం, చేపల చెరువులు వంటి వాటితో పాటు రెండేళ్లుగా ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేసేలా చర్యలు తీసుకుంటోంది. 100 శాతం రాయితీతో ఇచ్చే కింది పథకాలను రైతులు సద్వినియోగం చేసుకుంటే ఎంతో ప్రయోజనం ఉంటుంది.

**పశువుల పాకలు:** యూనిట్ ధర రూ.98 వేలు. మూడు పశువులు కచ్చితంగా ఉన్న వారికే ప్రాధాన్యం. మేకలు లేదా గొర్రెల షెడ్లు: యూనిట్ ధర రూ.98 వేలు. 10 మేకలు లేదా గొర్రెలు ఉన్న వారే పథకానికి అర్హులు.

**పౌల్ట్రీ షెడ్లు:** ఒక యూనిట్ ధర(మండలానికి కేవలం ఐదు) రూ.25 వేలు. రైతు షెడ్డును నిర్మించుకొని 100 నాటు కోడిపిల్లలను పెంచాల్సి



ఉంటుంది. 1000 నాటు కోడిపిల్లలు పెంచేందుకు రూ.3 లక్షలు చెల్లిస్తారు.

**అజోల్లా పెంపకం:** యూనిట్ ధర రూ.20 వేలు. రైతులకు మాత్రమే అందజేస్తారు.

**వర్మీ కంపోస్టు గుంతలు:** యూనిట్ ధర రూ.15 వేలు. రైతులు సామూహికంగా లేదా వ్యక్తిగతంగా చేసుకోవచ్చు.

**ఇంకుడు గుంతలు:** ఒక్క యూనిట్‌కు రూ.6,500 చొప్పున ఇస్తారు.

నిబంధనల ప్రకారమే పనులు...

ఎస్టీ, ఎస్సీ రైతులకు సంబంధించి సాగులో లేని భూముల్లో అభివృద్ధి పనులు, వ్యక్తిగత పనులు అందుబాటులో ఉంటాయి. లబ్ధిదారులు ఉపాధి హామీ పథకంలో నిబంధనల ప్రకారం మంజూరైన పనులు చేయాల్సి ఉంటుంది. పలు యూనిట్లకు కూలీల ఖర్చు, సామగ్రి ఖర్చులు కలిపి అందిస్తారు. మండల స్థాయిలో ఏపీవో, ఈసీ, టీఏ లేదా గ్రామస్థాయిలో క్షేత్ర సహాయకుడు లేదా పంచాయతీ కార్యదర్శులకు సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి.

పంచాయతీలు: 493
ఉపాధి జాబ్ కార్డులు: 1,64,322
పనిచేస్తున్న జాబ్‌కార్డులు: 1,13,484
కూలీలు: 3,31,431
పనిచేసేవారు: 2,09,344

# పెట్టుబడి భారం.. సాగుకు దూరం

గుర్రంపోడు : రెండు దశాబ్దాల క్రితం నల్గొండ జిల్లాలో బత్తాయి సాగుకు రైతులు అత్యంత ఉత్సాహం చూపేవారు. ఎకరం భూమి ఉన్నా తగ్గకపోయేవారు. కాని నేడు పరిస్థితి విభిన్నం. బత్తాయి అంటేనే భయాందోళన చెందుతున్నారు. తెగుళ్ల బెడద, దిగుబడి తగ్గి, ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగి సాగు భారంగా మారింది. దీనికి తోడు మార్కెట్లో ధరలు కూడా తగ్గుతూ వస్తుండటం రైతులను కుంగదీస్తున్నాయి. దీంతో ఏటా సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. ఇరవై ఏళ్ల కిందట ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు పైచిలుకు విస్తీర్ణంలో సాగవగా నేడు అధికారిక లెక్కల ప్రకారం 40వేల ఎకరాలకు లోపే ఉండటం ఇందుకు నిదర్శనం.

**తగ్గుతున్న దిగుబడి**

వేరుకుళ్లు వంటి తెగుళ్లు విజృంభించడంతో నియంత్రించలేని రైతులు బత్తాయి తోటలను వదిలేశారు. వేళ్లతో సహా చెట్లను తొలగించి పత్తి, ఆయిల్‌పాం సాగుకు మొగ్గుచూపుతున్నారు. ఓ వైపు నాణ్యత తగ్గిన బత్తాయికి మార్కెట్లో ధర కూడా పలకని పరిస్థితి నెలకొంది. ఈసారి మార్కెట్లో టన్ను ధర రూ.15 వేలకు పతనం అయింది. దీంతో రైతులకు కూళ్లు, రవాణా ఛార్జీలు కూడా మిగలని పరిస్థితి ఎదురైంది.

**రూ.8వేలే మిగిలాయి: యాదగిరిరెడ్డి, బత్తాయిరైతు, శాబ్దులాపురం**

ఎకరంలో సాగు చేస్తే కూలీలు రవాణా ఖర్చులు పోను రూ.8 వేలు మిగిలాయి. అందులోనే మా కుటుంబం పడిన కష్టం కూడా ఉంది. ఇక బత్తాయిని నమ్ముకుంటే బతకలేం. తీసివేద్దాం అంటే ఇంతకాలం పెంచుకున్న చెట్లను నరికివేయలేకపోతున్నాం. ప్రభుత్వం మాలాంటి చిన్న రైతులను ఆదుకోవాలి.



**మూడున్నర ఎకరాల్లో సాగుచేస్తున్నా..: దైద వేణుగోపాల్‌రెడ్డి, ఆరెగూడెం**

నాకున్న భూమిలో మూడున్నర ఎకరాల్లో సాగు చేశా. ఇప్పుడు ధర బాగా తగ్గింది. చెట్ల కిందనే పండ్లు పండి రాలిపోతున్నాయి. ఒకవేళ మరో నెలలో ధర పెరిగినా పండ్లు సగానికి పైగా రాలిపోతే నాకు మిగిలేదేముంది.

**మద్దతు ధర చెల్లించి ఆదుకోవాలి...: జొన్నలగడ్డ ఉపేందర్‌రెడ్డి, బత్తాయి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు**

ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి ఆదుకోకపోతే వచ్చే ఐదేళ్లలో ఒక్కరు కూడా బత్తాయి సాగుకు ముందుకు రారు. ఫలితంగా జిల్లాలో సాగు కనుమరుగవుతుంది. ప్రస్తుతం రైతులు ఎంతో ఇబ్బందుల్లో ఉన్నారు.




## దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు.. విశేష అలంకరణలో అమ్మవారు

తెలుగు రాష్ట్రాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారు వివిధ అలంకరణల్లో కొలువై భక్తులకు దర్శనమిస్తున్నారు. ఆలయాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు.

## ఎయిర్ బస్‌కు గోల్డ్ స్టాండర్డ్ వేదికగా ఆంధ్రప్రదేశ్: మంత్రి లోకేశ



దిల్లీ: మేకిన్ ఇండియా అమలుకు తొలిసారి దిల్లీలో ఎయిర్‌బస్ బోర్డు సమావేశం జరిగింది. ఈ భేటీకి ఏపీ మంత్రి నారా లోకేశ్ హాజరయ్యారు. రాష్ట్రానికి రావాలని ఎయిర్‌బస్ ప్రతినిధులను లోకేశ్ ఆహ్వానించారు. ఏపీలో ప్రపంచస్థాయి ఏరో స్పేస్ తయారీ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదన చేశారు. పారిశ్రామిక అవసరాలకు అనువైన భూమి ఉందని తెలిపారు. రాష్ట్రంలో ఎయిర్ బస్‌కు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. ప్రోగ్రెసివ్ ఏరోస్పేస్ పాలసీ, ప్రత్యేక ప్రోత్సాహకాలు ఉంటాయన్నారు. మల్టిపుల్ ఏరోస్పేస్ కారిడార్, ఎయిర్‌పోర్టులు, పోర్టులతో అనుసంధానంపై వివరించారు. వేగవంతమైన అనుమతులు, సింగిల్ విండోతో అన్నీ అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు.

ఎయిర్‌బస్‌కు గోల్డ్ స్టాండర్డ్ వేదికగా ఆంధ్రప్రదేశ్ అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ సదస్సుకు రండి..

## దక్షిణ కొరియాలో ప్రముఖ సంస్థలను ఆహ్వానించిన ఏపీ మంత్రులు



అమరావతి: దక్షిణ కొరియాలో మంత్రులు నారాయణ, బీసీ జనార్ధన్‌రెడ్డి బృందం పర్యటన కొనసాగుతోంది. రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో పర్యటిస్తున్న మంత్రులు, దక్షిణ కొరియాలోని ఇండియన్ ఎంబసీ అధికారులు, ఏపీ ఈడీబీ అధికారులను కలిశారు. కియా కార్ల పరిశ్రమ హెడ్ క్వార్టర్స్‌ను సందర్శించి..ఆ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. గ్లోబల్ మార్కెట్‌లో కియా కార్ల అమ్మకాలు, కియా యూనిట్‌ల విస్తరణపై చర్చించారు. ఏపీలో కియా యూనిట్‌కు ప్రభుత్వం అందిస్తున్న సహకారం, ప్లాంట్ విస్తరణ వంటి అంశాలపై చర్చించారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఏపీలో పెట్టుబడిదారులకు కల్పిస్తున్న అవకాశాలను కియా ప్రతినిధులకు వివరించిన మంత్రులు, విశాఖలో నవంబర్‌లో జరిగే పెట్టుబడిదారుల సదస్సుకు రావాలని ఆహ్వానించారు. సియోల్‌లో ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీ లొట్టే సంస్థ ప్రతినిధులతో సమావేశమైన మంత్రులు, ఉన్నతాధికారులు.. ప్రపంచవ్యాప్తంగా ఫుడ్, కెమికల్స్, ఫార్మా రంగాలలో పెట్టుబడులు పెట్టే లొట్టే గ్రూప్‌ను ఏపీకి ఆహ్వానించారు. అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖ వేదికగా నిర్వహించనున్న 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు లొట్టే సంస్థ ప్రతినిధులను ప్రత్యేకంగా ఆహ్వానించారు.

## 'నా బీసీ' మాటలు అర్ధరహితం.. జగన్‌పై మంత్రి పార్ధసారధి సెటైర్లు



అమరావతి, సెప్టెంబర్ 30: నేతి బీరకాయలో నేతి ఎలా అయితే ఉండదో.. నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ అంటూ చెప్పుకునే జగన్ రెడ్డికి ప్రేమ కూడా అదే విధంగా ఉంటుందని మంత్రి కొలుసు పార్థసారథి వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ సామాజిక న్యాయమని చెప్పడమే కానీ, ఆచరణ ఉండదని విమర్శించారు. బీసీ నాయకుడు చంద్రయ్యను వైసీపీ పాలనలో హత్య చేస్తే, ఆయన కుటుంబానికి జరిగిన అన్యాయానికి కూటమి ప్రభుత్వం మేలు చేస్తుంటే వైసీపీ అడ్డుకుంటోందని మండిపడ్డారు. దీన్ని బట్టి వైసీపీకి బీసీల పట్ల ప్రేమ ఎంత అనేది అర్థం అవుతోందన్నారు. జగన్ పాలనలో అన్ని ముఖ్యమైన పదవుల్లో గానీ, అఖరికి పార్టీ పదవుల్లో కూడా అగ్రవర్ణలతో, వారి సంబంధించిన సామాజికవర్గంతో ప్రభుత్వాన్ని నడిపారని విమర్శించారు. వైసీపీ రౌడీల చేతుల్లో, వైసీపీ అరాచక శక్తుల చేతుల్లో చంద్రయ్య బలయ్యాడని.. అన్యాయంగా బలైన చంద్రయ్య కుమారుడికి ఉద్యోగం ఇస్తామంటే ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. దీనికి వైసీపీలో బీసీలు అని చెప్పుకుంటున్న నాయకులు అందరూ కూడా సమాధానం చెప్పాల్సిందే అని మంత్రి డిమాండ్ చేశారు. వైసీపీలో బీసీలకు న్యాయం జరిగే పరిస్థితి లేనేలేదన్నారు. గతంలో కార్పొరేషన్లు ఏర్పాటు చేసి కేవలం నామమాత్రంగా కుర్చీలకు పరిమితం చేశారని మండిపడ్డారు. కొంతమందికి కుర్చీలు కూడా లేకుండా చేసి బీసీ కార్పొరేషన్ చైర్మన్లను అవమానించిన వైసీపీ తీరును ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేదని ఆయన అన్నారు. సీఎం చంద్రబాబు సారధ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బీసీలకు సామాజిక గౌరవం పెంచే విధంగా ప్రజలందరూ కూడా ఆలోచన చేయాలన్నారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఏ రాష్ట్రంలో కూడా మద్యం దుకాణాలు బీసీలకు కేటాయించిన దాఖలాలు లేవన్నారు. కూటమి ప్రభుత్వంలో గౌడ కులస్తులకు మద్యం దుకాణాల్లో 10 శాతం రిజర్వేషన్ కేటాయించడం, బలహీన వర్గాలు ఆర్థికంగా బలపడాలనే కాంక్ష తెలుగుదేశం పార్టీ నాయకత్వంలో ఏవిధంగా ఉందో.. కూటమి ప్రభుత్వ ఆలోచన ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. బీసీల హక్కులను కాపాడేందుకు త్వరలో ఒక చట్టాన్ని తీసుకొస్తున్నామని మంత్రి కొలుసు పార్ధసారథి పేర్కొన్నారు.

## జగన్ ప్రభుత్వం హిందూ సంప్రదాయాన్ని భ్రష్టు పట్టించింది: మంత్రి ఆనం

నెల్లూరు, సెప్టెంబరు30 : హిందూ ధర్మానికి, ఆచార కార్యక్రమాలకి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఉద్ఘాటించారు. జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో హిందూ సంప్రదాయాన్ని భ్రష్టు పట్టించిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హిందూ ధర్మ హామీలని 98 శాతం పూర్తి చేసిందని స్పష్టం చేశారు. ఇవాళ(మంగళవారం) నెల్లూరులో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మీడియాతో మాట్లాడారు. వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా కూటమి ప్రభుత్వం ప్రకటించిందని గుర్తుచేశారు. ఈ ఉత్సవాలను పెనుగొండలో నిర్వహిస్తున్నామని చెప్పుకొచ్చారు. ధూప దీప నైవేద్యాలు నిర్వహించేందుకు ఏపీలోని 5600 ఆలయాలకి రూ.10వేలు విడుదల చేస్తున్నామని ప్రకటించారు. వేద విద్యార్థులకి నెలకు రూ.3వేల చొప్పున ఆరు వందల మందికి భృతి అందిస్తున్నామని స్పష్టం చేశారు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి. అర్చకులకి రూ.15 వేల చొప్పున కూటమి ప్రభుత్వం అందిస్తోందని ఉద్ఘాటించారు. ఆలయాల్లో నాయీబ్రాహ్మణులకి ట్రస్టు బోర్డు మెంబర్లుగా అవకాశం కల్పించామని గుర్తుచేశారు. ఆలయాల్లో పనిచేసే నాయీబ్రాహ్మణులకి రూ.25 వేల భృతి కల్పిస్తున్నామని తెలిపారు. దేవాలయాల ఆస్తుల పరిరక్షణ కోసం స్పెషల్ చీఫ్ సెక్రటరీ, డీజీపీలతో కూటమి ప్రభుత్వం కమిటీ వేసిందని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు.




## విశాఖలో 7 కేజీల బంగారం.. రూ.5 కోట్ల కరెన్సీతో అమ్మవారికి అలంకరణ

విశాఖపట్నం: నగరంలోని ఓల్డ్ టౌన్ పరిధి కురుపాం మార్కెట్ ప్రాంతంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. 148 ఏళ్ల పురాతన కన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం అమ్మవారిని మహాలక్ష్మి అలంకరణలో తీర్చిదిద్దారు. 7 కేజీల బంగారు ఆభరణాలు, బిస్కెట్లు.. 12 కేజీల వెండి, రూ.5 కోట్ల విలువైన కరెన్సీ నోట్లతో అద్భుతంగా అలంకరించారు. ఆలయంలో 250 మంది మహిళలతో కోటి కుంకుమార్చన నిర్వహించినట్లు దేవస్థాన సంఘం అధ్యక్షులు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు తెలిపారు.




మేక్ ఇన్ ఇండియాలో భాగంగా దేశీయంగా ఆయుధాలు, క్షిపణుల తయారీని ప్రోత్సహించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఎయిర్ మార్షల్ ఏకే భారతి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవని.. మన మిత్ర దేశాలు ఎల్లవేళలా మనతో సాంకేతికతను పంచుకుంటారనే నమ్మకం లేదన్నారు. కాబట్టి భవిష్యత్తు యుద్ధాల్లో విజయం సాధించాలంటే దేశీయంగా ఆయుధ తయారీ మరింత పెంచడమే మార్గమన్నారు. దీనికోసం దేశంలో పరిశోధనలు, అభివృద్ధిని వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏరో టెక్ ఇండియా 2025 కార్యక్రమంలో ప్రసంగించిన భారతి ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం స్వదేశీ ఆయుధ తయారీ చాలా తక్కువ మొత్తంలో.. నెమ్మదిగా కొనసాగుతోందని ఎయిర్ మార్షల్ భారతి అన్నారు. ఇలాగేఉంటే భవిష్యత్తులో ఇతర దేశాలతో పోటీపడడం కష్టమవుతుందన్నారు. భవిష్యత్తు యుద్ధాలలో గెలుపొందాలంటే కీలకమైన సాంకేతిక పరిజ్ఞానాలలో వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని సాధించాలని.. ఇందుకు భారత్ మరింత దూకుడుగా వ్యవహరించాల్సి ఉందన్నారు. పరిశోధనలు, ఆవిష్కరణలు మరింత వేగవంతమవ్వాలని సూచించారు. స్వదేశీ ఆయుధాలను అభివృద్ధి చేయడానికి భారత ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నప్పటికీ అది చాలా నెమ్మదిగా జరుగుతుందన్నారు. డ్రోన్లు, మానవరహిత వ్యవస్థలు, ఏఐ సాంకేతిక భవిష్యత్తును శాసిస్తాయని.. రోబోలు మానవులతో కలిసి పోరాడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో స్వదేశీ ఆయుధాల శక్తిని ప్రపంచదేశాలు చూశాయని.. అదేవిధంగా మరిన్ని ఆయుధాల తయారీకి నడుం బిగించాలన్నారు. ఇతర దేశాల నుంచి ఆయుధాలు దిగుమతి చేసుకోడాన్ని తగ్గించుకోవాలని సూచించారు. దేశంలో యుద్ధ విమానాలు, ఎయిర్ టు ఎయిర్ క్షిపణులు, స్టాండ్ ఆఫ్ ఆయుధాల కొరత తీవ్రంగా ఉందన్నారు. భవిష్యత్తు పరిస్థితులను దృష్టిలోఉంచుకొని వాటి తయారీకి చర్యలు తీసుకోవాలని.. రక్షణరంగాన్ని మరింత పటిష్టం చేసుకోవాలని పేర్కొన్నారు.




తిరుమల: తిరుమలలో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం సూర్యప్రభ వాహనంపై శ్రీనివాసుడు భక్తులకు అభయప్రదానం చేశారు. వాహనసేవను తిలకించేందుకు భారీగా భక్తులు మాడవీధుల్లోకి తరలివచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంటకు స్నపన తిరుమంజనం, రాత్రి 7 గంటల నుంచి చంద్రప్రభ వాహనసేవ అట్టహాసంగా నిర్వహించారు.

## కూటమి ప్రభుత్వం సహకారంతో క్షేమంగా విడుదలయ్యాం: కాకినాడ మత్స్యకారులు

కాకినాడ: శ్రీలంక జాఫ్నా జైలు నుంచి నలుగురు మత్స్యకారులు కాకినాడ చేరుకున్నారు. నావిగేషన్ వ్యవస్థలో ఏర్పడిన సాంకేతిక సమస్య కారణంగా పొరపాటున శ్రీలంక సముద్ర జలాల్లోకి ప్రవేశించి, 52 రోజులు అక్కడి జైల్లో ఉన్న కాకినాడ మత్స్యకారులు ఎట్టకేలకు కుటుంబ సభ్యుల చెంతకు చేరారు. ఆగస్టు 4న కాకినాడలోని జగన్నాథపురం ప్రాంతానికి చెందిన బ్రహ్మానందం సహా మరో ముగ్గురు మత్స్యకారులను అక్రమంగా తమ సముద్ర జలాల్లోకి ప్రవేశించారన్న కారణంతో శ్రీలంక కోస్ట్‌గార్డ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని జాఫ్నా జైల్లో నిర్బంధించారు. కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్.. శ్రీలంకలోని భారత కాన్సుల్ జనరల్ అధికారి సాయి మురళితో మాట్లాడి పరిస్థితిని వివరించారు. ఎప్పటికప్పుడు దిల్లీలోని విదేశాంగశాఖ అధికారులను సంప్రదించి మత్స్యకారుల విడుదలకు చర్యలు తీసుకోవాలని ఒత్తిడి తీసుకొచ్చారు. శ్రీలంకలోని భారత దౌత్య అధికారులు విస్తృత సంప్రదింపులు జరిపి, మత్స్యకారుల తరఫున న్యాయపోరాటం చేసి వారిని విడిపించారు. గురువారం నలుగురు మత్స్యకారులు జైలు నుంచి విడుదలకాగా.. బోట్లలో సముద్రమార్గంలో ఇవాళ కాకినాడ చేరుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే కొండబాబు, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ స్థానికులు కాకినాడ చేరుకున్న మత్స్యకారులకు స్వాగతం పలికారు. కూటమి ప్రభుత్వం సహకారంతో క్షేమంగా విడుదలయ్యామని మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు.



**హర్షం వ్యక్తం చేసిన మంత్రి అచ్చెన్నాయుడు...** నలుగురు మత్స్యకారులు కాకినాడ చేరుకోవడం పట్ల వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి, వారిని విడుదల చేసేందుకు అచ్చెన్న ఎంతో కృషి చేశారు. సముద్రమార్గం ద్వారా వారు సురక్షితంగా కాకినాడకు చేరుకునేలా అచ్చెన్నాయుడు ఏర్పాట్లు చేయించారు. కాకినాడ చేరుకున్న మత్స్యకారులు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి, తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. చేపల వేట సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మత్స్యకారులకు మంత్రి అచ్చెన్న సూచించారు.



## విజయవాడలో దారుణం.. ఏడో తరగతి బాలికపై బాబాయ్ అత్యాచారం!

విజయవాడ: నగర శివారు పాయకాపురంలో దారుణం చోటుచేసుకుంది. ఏడో తరగతి విద్యార్థినిపై వరుసకు బాబాయ్ అయిన వ్యక్తి అత్యాచారం చేశాడు. ఆరేళ్ల క్రితం బాలిక తల్లిదండ్రులు చనిపోవడంతో.. పిన్ని, బాబాయ్ దగ్గర ఆమె ఆశ్రయం పొందుతోంది. ఈ క్రమంలో బాబాయ్ అత్యాచారానికి పాల్పడటంతో నున్న గ్రామీణ పోలీసులకు బాలిక ఫిర్యాదు చేసింది. అనారోగ్యంతో ఉన్న బాలికకు వైద్యపరీక్షలు నిర్వహించగా.. గర్భం దాల్చినట్లు వైద్యులు నిర్ధరించారు. ఫోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## సైట్ కొడితే పక్కకు పిలిచి కుమ్మేస్తానంటోంది!

ముంబై బ్యూటీ రితికా సింగ్ సుపరిచిమతే. 'గురు'..'నీవెవరో' లాంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది. ఇటీవలే రిలీజ్ అయిన కింగ్ ఆఫ్ కొత్త సినిమాలోనూ నటించింది. తమిళ్, మలయాళ చిత్రాల్లోనూ పనిచేసింది. కానీ ఏ భాషలోనూ బిజీ నటిగా మారలేకపోయింది. అందం, అభినయం గల నాయికే అయినా అవకాశాలు అందుకోవడంలో వెనుకబడింది. పోటీని తట్టుకుని మార్కెట్ లో నిలబడలేకపోతుంది. ఈ మధ్య కాలంలో అమ్మడు నటించిన సోలో చిత్రాలేవి రిలీజ్ కాలేదు. చివరిగా రజనీకాంత్ నటించిన వెట్టేయాన్‌లో నటించింది. ఆ తర్వాత రితిక అడ్రస్ లేదు. కానీ ఈ బ్యూటీలో మరో ప్రత్యేకత కూడా ఉంది. అమ్మడు మిక్స్ డు మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణ తీసుకుంది. చిన్న వయసు నుంచే మార్షల్ ఆర్ట్స్ లో తర్ఫీదు పొందింది. ఆ ట్యాలెంట్ తోనే %-%గురు%-%లో బాక్సర్ పాత్రకు ఎంపికైంది. కానీ తాను రియల్ లైఫ్ లోనూ రియల్ బాక్సర్ అన్నది చాలా తక్కువ మందికే తెలుసు. మహిళలపై దాడులు



జరిగిన సమయంలో సోషల్ మీడియాలో తప్పక స్పందిస్తుంది. స్వీయా రక్షణపై అవగాహన కల్పిస్తుంటుంది. ఈ క్రమంలో నేటి జనరేషన్ మహిళలంతా తప్పకుండా బాక్సింగ్ , కరాటే, కుంగూఫూ లాంటివి నేర్చుకోవాలని సూచించింది. ఇలాంటి విద్యలు తెలిస్తే తమను తాము కాపాడుకోగలుగుతారని ముందు జాగ్రత్త చెప్పింది. దేశంలో అత్యాచారాలు పెరుగుతోన్న వేళ ఇలాంటి విద్యలు తెలిస్తే వాటి నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుందన్నారు. అలాగే తనకు ఎవరైనా సైట్ కొట్టినట్లు అనిపిస్తే ఎలాంటి భయం లేకుండా అతడిని పక్కకు పిలిచి కుమ్మేస్తానంది. అలాంటి వాటిని చూస్తూ ఊరుకోనంది. ఛాన్స్ ఇస్తేనే ఎవరైనా చూస్తారని..ఆ ఛాన్సే ఇవ్వకుండా చేతి బలం చూపిస్తే? పిచ్చి పిచ్చి వేశాలు వేసే వారు భయపడతారంది. మారుతోన్న రోజుల్లో మహిళలు కూడా అంతే మారాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపింది.ఈ బ్యూటీ కూడా సోషల్ మీడియాలో యాక్టివ్ గానే ఉంటుంది. ఎప్పటికప్పుడు కొత్త ఫోటోలు షేర్ చేస్తూ కుర్ర కారులో సెగలు రేపుతుంది. చేతిలో సినిమాలు లేకపోయినా ఇప్పటికీ యువత అటెన్షన్ డ్రా చేస్తుందంటే? కారణం అమ్మ డిలో ఆ రకమైన యాంగిలే అని చెప్పాల్సిన పనిలేదు. ఇన్ స్టాలోనూ అమ్మడికి భారీ ఫాలోయింగ్ ఉంది. ఆ క్రేజ్ తో మాత్రం సినిమా అవకాశాలు అందుకోలేకపోతుంది.

## 'దీపికకు అంత టైమ్ లేదులే'.. డెబ్యూ డైరెక్టర్ సెటైర్లు..

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె కొద్ది రోజులుగా వార్తల్లో నిలుస్తున్న విషయం తెలిసిందే. బీ టౌన్ లో స్టార్ హీరోలందరితో కలిసి నటించిన అమ్మడు.. వేరే లెవెల్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుందనే చెప్పాలి. ఇప్పటి వరకు అనేక సినిమాలతో సూపర్ హిట్స్ అందుకున్న దీపిక.. ఇప్పుడు మరిన్ని చిత్రాలతో బిజీగా ఉన్నారు. కల్కి 2898 ఏడీతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన దీపిక.. ప్రస్తుతం ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తో వర్క్ చేస్తున్నారు. కానీ ఇటీవల స్పిరిట్ తో పాటు కల్కి సీక్వెల్ ప్రాజెక్టులను చేజార్చుకున్నారు. కేవలం 8 గంటలు మాత్రమే పనిచేస్తానని దీపిక చెబుతుండడంతో ఆయా సినిమాల మేకర్స్ నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో దీపిక చెబుతున్న 8 గంటలపాటు వర్క్ చేసే విషయంపై సినీ వర్గాల్లో చర్చలు జరుగుతూనే ఉన్నాయి. కొందరు ఆమెకు మద్దతు తెలుపుతుంటే.. మరికొందరు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇంకొందరు దీపికపై సెటైర్లు



వేస్తున్నారు. ఇప్పుడు బాలీవుడ్ దర్శకురాలు ఫరాఖాన్ కూడా అదే చేశారు. రీసెంట్ గా ఆమె బీ టౌన్ నటుడు రోహిత్ సరఫ్ ఇంటికి వెళ్లగా.. ఆ సమయంలో యూట్యూబ్ వ్లాగ్ షూట్ చేశారు. అప్పుడు ఫరా ఖాన్.. రోహిత్ సరఫ్ తల్లి ఫేస్ ను రివీల్ చేశారు. ఆమెను అంతా చూడటం ఇదే తొలిసారి. దీంతో ఆ సమయంలో ఫరా.. దీపికను ఓ సినిమా కోసం ఒప్పించడానికి కూడా ఇంత టైమ్ పట్టదని వ్యంగ్యంగా మాట్లాడారు. అప్పుడే ఫరా ఖాన్ చెఫ్.. దీపిక మన షోకు ఎప్పుడొస్తారని అడిగారు. అప్పుడు ఆమెకు టైమ్ లేదని అన్నారు. రోజుకు ఎనిమిది గంటలు మాత్రమే వర్క్ చేస్తుందని అన్నారు. అందుకే షోలో పార్టిసిపేట్ చేసే అంత సమయం లేదని సెటైర్ వేశారు. అందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. కాగా.. ఇక్కడ మరో విషయమేమిటంటే.. దీపిక హీరోయిన్ గా డెబ్యూ మూవీ ఫరాఖాన్ తోనే చేశారు. షారుక్ ఖాన్ సరసన ఓం శాంతి ఓం లో నటించారు. ఆ తర్వాత న్యూ ఇయర్ మూవీకి గాను మరోసారి ఫారాతో చేతులు కలిపారు. అందులోనూ షారుకే హీరోగా నటించడం గమనార్హం. మొత్తానికి దీపిక నిర్ణయం ఫరాకు నచ్చనట్లు ఉంది. అందుకే సెటైర్ వేసినట్లు అర్థమవుతుంది.




## పాన్ ఇండియా అడుగుల్లో జబర్దస్త్ కమెడియన్!




సుడిగాలి సుధీర్ గురించి అందరికీ తెలిసిందే. జబర్దస్త్ కామెడీ షోతో బుల్లితెరపై విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్న సుధీర్.. కమెడియన్, క్యారెక్టర్ ఆర్టిస్ట్, హీరోగా తెలుగు సినీ ప్రేక్షకులను మెప్పించారు. తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు. ఇప్పటికే లీడ్ రోల్ లో నాలుగు సినిమాలు చేసి తనదైన ముద్ర వేశారు. తాజాగా కొత్త సినిమాను అనౌన్స్ చేశారు సుడిగాలి సుధీర్. హైలెస్సో టైటిల్ తో తెరకెక్కుతున్న ఆ మూవీతో ప్రసన్న కుమార్ కోట దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయమవుతున్నారు. వజ్ర వారాహి సినిమాస్ బ్యానర్ పై శివ చెర్రీ, రవి కిరణ్ నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో నేడు పూజా కార్యక్రమాలు హైదరాబాద్ లో గ్రాండ్ గా జరిగాయి. ఆ కార్యక్రమానికి టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సహా అనేక మంది సెలబ్రిటీలు అటెండ్ అయ్యారు. హీరో నిఖిల్ టైటిల్ పోస్టర్ ను రిలీజ్ చేయగా.. నిర్మాత బన్నీ వాస్ మూవీ స్క్రిప్ట్ మేకర్స్ కు అందించారు. దర్శకులు వశిష్ట, చందూ మొండేటి, మెహర్ రమేష్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ప్రముఖ దర్శకుడు వీవీ వినాయక్ ముహూర్తపు షాట్ కు క్లాప్ కొట్టారు. అయితే హైలెస్సో మూవీ టైటిల్ పోస్టర్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. అందరినీ ఆకట్టుకుని సందడి చేస్తోంది. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సినిమా రూపొందుతున్న తెలుస్తోంది. మైథలాజికల్ టచ్ కూడా మేకర్స్ ఇస్తున్నట్లు అర్థమవుతోంది. పోస్టర్ లో కాలికి ఉంగరాలు, బంగారు చీలమండలతో ఓ పాదం ఉంది. అది కూడా గంభీరంగా పచ్చ రంగు ఆకుపై ఉంది. ఆ పక్కన సింధూరం రంగులో అన్నం, కోడి- మేక తలలు ఉన్నాయి. దీంతో సినిమా.. గ్రామీణ నేపథ్యంలో జాతరను బ్యాక్ డ్రాప్ ను తీసుకున్నారని తెలుస్తోంది. పోస్టర్ లో రక్తంతో తడిసిన కత్తి ఉండటం గమనార్హం. అయితే మూవీ తెలుగు, తమిళ, కన్నడ, మలయాళంలో రిలీజ్ కానుంది. ఇక సినిమా విషయానికొస్తే.. నటాషా సింగ్, నక్ష కిరణ్ హీరోయిన్లుగా యాక్ట్ చేయనున్నారు. విలన్ రోల్ లో శివాజీ.. కన్నడ హీరోయిన్ అక్షర గౌడ కీలక పాత్రలో కనిపించనున్నారు. రాజేంద్రన్, గెటప్ శ్రీను, శరణ్య సహా పలువురు ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. అనుదీప్ దేవ్ మ్యూజిక్ అందిస్తున్నారు. మరి హైలెస్సో మూవీ ఎప్పుడు రిలీజ్ అవుతుందో వేచి చూడాలి.

## ఇది క్లిక్ అయితే మోహన్ బాబు దొరకడు




ఇంకా ఎన్నేళ్లు కష్టపడడం అనుకున్నారో, బయటి సినిమాల్లో చేయడం ఇష్టం లేదో, పిల్లలకు వారసత్వాన్ని ఇచ్చేసి తాను తగ్గుదాం అనుకున్నారో.. కారణాలు ఏవైనా కానీ గత రెండు దశాబ్దాలుగా మోహన్ బాబు సినిమాలు బాగా తగ్గించేశారు.. అప్పుడప్పుడూ సొంత బేనర్లో సినిమాలు చేసినా అవి ఆయన స్థాయికి తగ్గవి కాదు. బయట యమదొంగ, బుజ్జిగాడు లాంటి సినిమాల్లో నటించగా.. వాటిలో ఆయన పాత్రలకు అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. కానీ మోహన్ బాబు అలాంటివి మరిన్ని పాత్రలు చేస్తే చూడాలన్న అభిమానుల ఆశ నెరవేరలేదు. క్రమ క్రమంగా సినిమాలు తగ్గించేసి లైమ్ లైట్‌కు దూరం అయిపోయారు మోహన్ బాబు. హీరోగా, విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా అద్భుతమైన పాత్రలు చేసి తెలుగు సినిమా చరిత్రలోనే మేటి నటుల్లో ఒకడిగా పేరు తెచ్చుకున్న నటుడు.. ఇలా సినిమాలకు దూరం అయిపోవడం టాలీవుడ్ దురదృష్టం అనే చెప్పాలి. మోహన్ బాబు అందుబాటులో ఉండి, మంచి పాత్రలిస్తే చేయడానికైనా సిద్ధం అన్నాడంటే.. ఎంతోమంది యువ దర్శకులు ఆయన కోసం రెడీగా ఉంటారనడంలో సందేహం లేదు. ఐతే మోహన్ బాబును ఎలా ఒప్పించాడో కానీ దసరా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల.. తన కొత్త చిత్రం ది ప్యారడైజ్‌లో ఆయనతో విలన్ పాత్ర చేయిస్తున్నాడు. ఈ న్యూస్ కొన్ని రోజుల ముందే బ్రేక్ అయింది. ఇప్పుడు అది అధికారికం అయింది. నాని సినిమాలో మోహన్ బాబు విలన్ అంటే మామూలుగా ఉండదంటూ.. ఈ సినిమాలో ఆయన పాత్ర కోసం ఎదురు చూస్తున్నారు అభిమానులు. ఇంతలో రెండు లుక్స్‌తో పోస్టర్లు వదిలాడు శ్రీకాంత్ ఓదెల. ఈ సినిమా హైప్‌ను ఇంకో లెవెల్‌కు తీసుకెళ్లేలా..మోహన్ బాబు అభిమానులను ఉర్రూతలూగించేలా ఆ పోస్టర్లను డిజైన్ చేశారు. మోహన్ బాబు అంటే ఏంటో తెలియని ఈ తరం ప్రేక్షకులకు ఈ సినిమాతో మైండ్ బ్లాంక్ కావడం ఖాయమనే సంకేతాలు ఇచ్చాయి ఈ పోస్టర్లు. ఈ సినిమాలో మోహన్ బాబు పాత్ర బలంగా ఉంటే చాలు. ఆయన. పెర్ఫామెన్స్ అదరగొట్టేస్తారనడంలో సందేహం లేదు. అదే జరిగితే మోహన్ బాబుకు టాలీవుడ్లో ఒక్కసారిగా డిమాండ్ పెరిగిపోవడం, ఆయన అందరికీ దొరకనంత బిజీ అయిపోవడం ఖాయం.

## తెలుసు కదా డైరెక్టర్ పై శ్రీనిధి కామెంట్స్.. ఇన్ని టాలెంట్స్ ఉన్నాయా?

ప్రముఖ కాస్ట్యూమ్ డిజైనర్ నీరజాకోన తొలి దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'తెలుసు కదా'. అక్టోబర్ 17వ తేదీన భారీ అంచనాల మధ్య రాబోతున్న ఈ సినిమాలో యంగ్ హీరో సిద్దు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్నారు. అలాగే కేజీఎఫ్ , హిట్ చిత్రాలతో భారీ పాపులారిటీ అందుకున్న శ్రీనిధి శెట్టి అలాగే రాశిఖన్నా కలిసి స్క్రీన్ షేర్ చేసుకోబోతుండడంతో అంచనాలు భారీగా పెరిగిపోయాయి. ఈ సినిమాని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిబోట్ల నిర్మించారు. తెలుగు భాషా రొమాంటిక్ డ్రామాగా వస్తున్న ఈ సినిమాకి తమన్ సంగీతం అందించారు. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలలో పాల్గొంటున్న చిత్ర బృందం ఎన్నో విషయాలను పంచుకుంటున్నారు. అందులో భాగంగానే తాజాగా ఒక ఛానల్ కు ఇంటర్వ్యూ ఇచ్చిన హీరోయిన్ శ్రీనిధి శెట్టి సినిమా కబుర్లు చెప్పడమే కాకుండా డైరెక్టర్ గా తన కెరియర్ ను యు టర్న్ తీసుకున్న నీరజా కోన గురించి కూడా ఊహించని కామెంట్లు చేశారు. ముఖ్యంగా ఆమెలో ఉన్న టాలెంట్స్ ను బయటపెట్టి అందరిని ఆశ్చర్యపరిచారు. కాస్ట్యూమ్ డిజైనర్ గా పేరు తెచ్చుకున్న నీరజ కోన మొదటిసారి డైరెక్టర్ అయ్యారు కదా.. ఆమె సెట్ లో ఎలా ఉంటారు? ఆమె డైరెక్షన్ ఎలా ఉంది? అని



ప్రశ్నించగా శ్రీనిధి శెట్టి మాట్లాడుతూ.. "అసలు ఆమెకు ఈ సినిమా తొలి డైరెక్షన్ అంటే ఎవరు నమ్మరు. డైరెక్షన్ విభాగంలో ఎంతో అనుభవం ఉన్న వ్యక్తిగా ఈ సినిమాను చాలా అద్భుతంగా రూపొందించారు. ఆమె డైరెక్టర్ మాత్రమే కాదు లిరిసిస్ట్ కూడా.. ఈ మధ్యనే నాకు ఈ విషయం తెలిసింది. ఆమె గతంలో కూడా కొన్ని పాటలకు లిరిక్స్ అందించారట. ఆమె కాస్ట్యూమ్ డిజైనర్ గా, స్టైలిస్ట్ గా , గేయ రచయిత్రిగా మంచి పేరు దక్కించుకున్నారు. ఇప్పుడు డైరెక్టర్ గా కూడా సక్సెస్ కాబోతున్నారు" అంటూ నీరజ కోన గురించి పలు కామెంట్లు చేసింది శ్రీనిధి శెట్టి. నీరజ కోన విషయానికి వస్తే.. అమెరికాలో 14 సంవత్సరాల పాటు ఫ్యాషన్ కోర్సులు నేర్చుకొని.. ఇండియాకి తిరిగి వచ్చి తన సోదరుడు కోన వెంకట్ ద్వారా 'గుండెజారి గల్లంతయ్యిందే' సినిమాతో ఇండస్ట్రీకి పరిచయమైంది.. ఇందులో హీరో నితిన్ కి స్టైలిస్ట్ గా పనిచేసింది. ఆ తర్వాత రామయ్యా వస్తావయ్యా, అత్తారింటికి దారేది, ఎవడు, కొరియర్ బాయ్ కళ్యాణ్ వంటి చిత్రాలకు పనిచేసి.. నటి సమంత కు వ్యక్తిగత స్టైలిస్ట్ గా కూడా వ్యవహరించింది. అలాగే తిక్క, చల్ మోహన్ రంగా, మిస్ ఇండియా వంటి చిత్రాలలో కొన్ని పాటలకు గేయ రచయిత్రి గా కూడా పనిచేసింది. ఇప్పుడు తెలుసు కదా సినిమాతో డైరెక్టర్ గా అవతరించిన నీరజాకోన ఈ సినిమాతో సక్సెస్ అందుకోవాలని అభిమానులు, సెలబ్రిటీలు కూడా కోరుకుంటున్నారు.

## పచ్చని పొలాల మధ్య సందడి చేస్తున్న అనుపమ..

అనుపమ పరమేశ్వరన్.. ఒకప్పుడు చాలా సెలెక్టివ్ గా పాత్రలు ఎంచుకుంటూ చాలా పద్ధతిగా కనిపించి ప్రేక్షకులను ఆకట్టు కుంది. ముఖ్యంగా ఈ మలయాళీ ముద్దుగుమ్మకు తెలుగులో భారీగానే ఆఫర్లు వచ్చాయి. దీంతో అమ్మడు రేంజ్ స్టార్ స్టేటస్ కి పెరిగిపో తుందని అందరూ అనుకున్నారు.. కానీ అనూహ్యంగా అనుపమ పరమేశ్వరన్ కి అవకాశాలు తగ్గిపోయాయి. దాంతో కొన్నాళ్లు ఇండస్ట్రీకి దూరంగా ఉన్న ఈమె.. మళ్లీ రెట్టింపు వేగంతో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. వరుస సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది. ఇటీవల పరదా అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈమె.. ఈ సినిమాతో పెద్దగా ఆకట్టుకోలేదు. మళ్ళీ ఇప్పుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తో కలిసి 'కిష్కింధపురి' అనే సినిమా చేసింది. ఎన్నో అంచనాల మధ్య వచ్చిన ఈ సినిమా మంచి పాజిటివ్ టాక్ కూడా దక్కించుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు 'బైసన్' అనే మరో సినిమాలో నటిస్తోంది అనుపమ. ఈ సినిమాకు సంబంధించిన ప్రతి అప్డేట్ ను తన సోషల్ మీడియా ఖాతాలో రిలీజ్ చేస్తూ అభిమానులకు చేరువయ్యే ప్రయత్నం చేస్తుంది. అలాగే మరొకవైపు సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉంటూ వరుస ఫోటోలు షేర్ చేస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది ఈ ముద్దుగుమ్మ. అందులో భాగంగానే తాజాగా అనుపమ షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. తాజాగా రెడ్ చుడీదార్ ధరిం చిన ఈమె.. పచ్చని పొలాల మధ్య పరవశించిపోతూ చూపరులను ఆకట్టుకుంది.



ముఖ్యంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో మనసును ఉత్సాహపరిచేలా ఫోటోలు షేర్ చేసింది అనుపమ. నిజానికి ఈ మధ్యకాలంలో ఇలాంటి ఫోటోలు షేర్ చేసి చాలా రోజులు అయింది అంటూ అభిమానులు కూడా కామెంట్లు చేస్తున్నారు. ఏది ఏమైనా అనుపమ షేర్ చేసిన ఈ ఫోటోలు మాత్రం అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. అనుపమ కెరియర్ విషయానికి వస్తే.. 'ప్రేమమ్' సినిమాలో చిన్న పాత్ర పోషించిన అనుపమ.. ఈ మలయాళం చిత్రం తోనే తన కెరీర్ ను మొదలుపెట్టింది. ఆ తర్వాత తెలుగులో నితిన్ హీరోగా, త్రివిక్రమ్ దర్శకత్వంలో వచ్చిన అ ఆ సినిమాలో నటించి ఆకట్టుకుంది. ఈ సినిమా తర్వాత శతమానం భవతి సినిమా చేసి ఓవర్ నైట్ లోనే స్టార్ సెలబ్రిటీ అయిపోయింది అనుపమ. మధ్యలో రంగస్థలం సినిమాలో అవకాశం వచ్చిందని ఈమెనే రిజెక్ట్ చేసిందని కొంతమంది లేనిపోని రూమర్స్ క్రియేట్ చేశారు. వాటి వల్ల ఆరు నెలల పాటు ఇండస్ట్రీకి దూరంగా ఉన్న అనుపమ మళ్లీ అన్నింటిని చక్కబెట్టుకుని వరుస అవకాశాలు అందుకుంటూ బిజీగా మారింది. అలా సౌత్ లో దాదాపు చాలామంది హీరోలతో నటించి మంచి పే రు దక్కించుకుంది. ఇప్పుడు కం బ్యాక్ లో వరుస చిత్రాలతోనే కాదు ఆ చిత్రాలతో సక్సెస్ కూడా అందుకుంటూ పాన్ ఇండియా హీరోయిన్ అయ్యే దిశగా అడుగులు వేస్తోంది. మరి ఈ అమ్మడి కెరీర్ కు మంచి బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ అందించే సినిమా ఎప్పుడు పడుతుందో చూడాలి




హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉపఎన్నిక కోసం ఎన్నికల కమిషన్ కసరత్తు పూర్తి చేసింది. ఈ మేరకు జూబ్లీహిల్స్ ఉపఎన్నిక తుది ఓటర్ల జాబితా విడుదల చేసింది. జాబితాను CEO సుదర్శన్ రెడ్డి ఇవాళ విడుదల చేశారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లో మొత్తం ఓటర్లు 3 లక్షల 99 వేలు ఉన్నట్లు తెలిపారు. జూలై 1న అర్హత తేదీగా తీసుకుని ఓటర్ల జాబితా సవరణ చేసినట్లు పేర్కొన్నారు. సవరణ అనంతరం జాబితాలో 2,07,382 మంది పురుషులు, 1,91,593 మంది మహిళలు, 25 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు, 6,106 మంది యువ ఓటర్లు, 2,613 మంది వృద్ధులు (80 ఏళ్లు పైబడిన వారు), 1,891 మంది దివ్యాంగులు ఉన్నట్లు స్పష్టం చేశారు. కాగా, 139 కేంద్రాల్లో 409 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు CEO సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో ఈ స్థానం ఖాళీ అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్నికలను స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఈసీ కీలక చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నాహాలు పూర్తి చేసింది. జూబ్లీహిల్స్‌కు జరుగుతోంది ఉపఎన్నిక అయినా.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ఈ ఎన్నికపై ఆసక్తి నెలకొంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో నగరంలో అధికార కాంగ్రెస్ పార్టీకి ఆశించినన్ని సీట్లు దక్కకపోవడంతో.. ఈ ఉపఎన్నికతో నగరంలో తన ఉనికి చాటుకోవాలని చూస్తోంది. మరోపక్క బీఆర్ఎస్ పార్టీ ఉన్న సీటును కాపాడుకోవాడానికి వ్యూహాలు రచిస్తోంది. అయితే.. తుది జాబితా విడుదల కావడంతో త్వరలోనే ఉప ఎన్నిక జరిగే అవకాశం ఉంది.




హైదరాబాద్: నగరంలో డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ అన్నారు. నగర నూతన సీపీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. "దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం హైదరాబాద్. ఇప్పుడు మనం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య డ్రగ్స్. దీనిపై ఉక్కుపాదం మోపుతాం. డ్రగ్స్ సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇతర రాష్ట్రాల పోలీసులతో సమన్వయం చేసుకుని ముందుకెళ్తాం. అవసరమైతే మరింత సిబ్బందిని కేటాయించి చర్యలు తీసుకుంటాం. నగరంలో సైబర్ నేరాలు అరికట్టేందుకు అనేక చర్యలు చేపట్టాం. కేటుగాళ్లు ఎక్కువగా వృద్ధులను టార్గెట్ చేసి మోసం చేస్తున్నారు. సైబర్ నేరాలపై అవగాహన, అప్రమత్తత లేక అనేక మంది నష్టపోతున్నారు. వీటిపై నగర ప్రజలంతా అవగాహన పెంచుకోవాలి. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల పేరుతో వచ్చే కాల్స్‌పై జాగ్రత్తగా ఉండాలి. హైదరాబాద్‌లో నేరాల కట్టడికి అనేక చర్యలు చేపడతాం. ఆన్‌లైన్ బెట్టింగ్ వల్ల యువత బాగా చెడిపోతోంది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌నకు ప్రమోషన్ చేయవద్దని వీఐపీలను కోరుతున్నా. డిజిటల్ అరెస్టుల పేరుతో వచ్చే కాల్స్‌ను నమ్మవద్దు. అరుదైన వ్యాధులకు ఔషధాలు అంటూ చేసే మోసాలూ పెరుగుతున్నాయి. ఆన్‌లైన్ మోసాలు చేసేవారిపై ప్రత్యేక నిఘా ఉంటుంది. కల్తీ ఆహారంపై ప్రతేక దృష్టి పెడతాం, ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తాం. మార్కెట్ ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏర్పాటు చేసి కల్తీ నేరగాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారింది. ఏటా లక్షల్లో కొత్త వాహనాలు వస్తున్నాయి. జీఎస్టీ తగ్గించాక వాహనాల కొనుగోళ్లు బాగా పెరిగాయి. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలు తగ్గించేందుకు కృషి చేస్తాం. ట్రాఫిక్ వల్ల సమయం వృథా మాత్రమే కాదు.. ఆరోగ్యమూ పాడవుతుంది. మద్యం తాగి రోడ్లపైకి వాహనాలతో వస్తే వదిలేది లేదు. వాళ్లను రోడ్ టెర్రరిస్టులుగా భావిస్తాం. ఇక చిన్నారులు, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. మహిళల జోలికి వస్తే సీరియస్‌గా తీసుకుంటాం" అని సజ్జనార్ హెచ్చరించారు.




## వినూత్న నిరసన.. కాంగ్రెస్ 'బాకీ కార్డు' విడుదల చేసిన మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్: రాష్ట్రంలో ఏ పల్లెకు వెళ్లినా గుంతల రోడ్లే దర్శనమిస్తున్నాయని.. రోడ్లు వేయకుండా ఫ్యూచర్‌సిటీకి ఆరులేన్ల రహదారికి శంకుస్థాపన చేయటం విడ్డూరంగా ఉందని మాజీమంత్రి, భారత రాష్ట్ర సమితి సీనియర్ నేత హరీశ్‌రావు మండిపడ్డారు. ఆరుగ్యారంటీలకు టాటా చెప్పిన రేవంత్‌రెడ్డి విలువైన భూములను విక్రయిస్తూ లంకె బిందెల వేట సాగిస్తున్నారని విమర్శించారు. మార్పు.. మార్పు అంటూ రాష్ట్ర ప్రజలను ఏమార్చారని మండిపడ్డారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ బాకీ కార్డును విడుదల చేసిన అనంతరం ఆయన ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 22 నెలలవుతున్నా ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. మాటిమాటికి మహిళలను కోటీశ్వరులను చేస్తానంటూ మోసం చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ చేతిలో మోసపోని వర్గమంటూ లేదని విమర్శించారు. తెలంగాణలో ఆరుగ్యారంటీలు అమలు చేస్తున్నామంటూ బిహార్ ప్రజలను కూడా రాహుల్‌గాంధీ మోసం చేస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతీరైతుకు రూ.75 వేలు, ప్రతీ మహిళకు రూ.44 వేలు కాంగ్రెస్ బాకీ పడిందన్నారు. అధికారంలోకి వచ్చి 22 నెలలువుతున్నా ఒక్క హమీని నెరవేర్చలేదని, అదే విషయాన్ని కాంగ్రెస్ బాకీ కార్డు రూపంలో ఎండగడతామన్నారు. రానున్న రోజుల్లో ఈ బాకీ కార్డే కాంగ్రెస్ పార్టీకి ఉరితాడు కాబోతుందన్నారు. ఇందుకోసం భారాస నాయకులు, కార్యకర్తలు శ్రమించాలని, పట్టణాలు, గ్రామాలు అన్న తేడా లేకుండా ప్రతీఇంటికీ ఈ కార్డును అందజేసి కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను వివరించాలన్నారు. కార్డుపై ప్రతి ఇంట్లో చర్చ జరగాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లడగటానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను ప్రజలు నిలదీయాలన్నారు. ఒక్కొక్కరికీ ఎంత బాకీ పడ్డారో ఇచ్చాకే కాంగ్రెస్ నాయకులు ఓట్లడగాలన్నారు.




హైదరాబాద్: డీజీపీ జితేందర్ పదవీ విరమణ కార్యక్రమాన్ని తెలంగాణ పోలీసు అకాడమీలో ఘనంగా నిర్వహించారు. పోలీసుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సైబర్ క్రైమ్, నార్కోటిక్స్‌పై కఠిన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసినట్లు తెలిపారు. కొన్ని సమస్యలను మానవతా కోణంలో పరిష్కరించామని.. బాధితులకు అండగా ఉండేందుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని వివరించారు. "డీజీపీగా అవకాశం కల్పించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు. గత 15 నెలల్లో శాంతి భద్రతలను అదుపులోకి తీసుకువచ్చాం. రాష్టవ్యాప్తంగా క్రైమ్ రేట్ తగ్గించడానికి అనేక చర్యలు చేపట్టాం. జాతీయ స్థాయిలో తెలంగాణ పోలీసుకు మంచి గుర్తింపు వచ్చింది. నార్కోటిక్స్, సైబర్ క్రైమ్‌లతో నిరంతరం యుద్ధం చేస్తున్నాం. బెట్టింగ్ మాఫియాపై లోతుగా దర్యాప్తు చేపట్టాం. దేశవ్యాప్తంగా అనేక చోట్ల సోదాలు నిర్వహించి నిందితులను అరెస్ట్ చేశాం. ఇండియా జస్టిస్ రిపోర్ట్ ప్రకారం తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. నేరాల ఛేదనలో టెక్నాలజీ చాలా కీలకం" అని జితేందర్ అన్నారు. ఉద్యోగ రీత్యా కుటుంబానికి, బంధువులకు దూరంగా ఉండాల్సి వచ్చిందని జితేందర్ పేర్కొన్నారు. తాను తల్లి, తండ్రి ఇద్దరినీ కోల్పోవడం చాలా బాధ కలిగించిందన్నారు. ఈ సందర్భంగా తన తల్లిని గుర్తు తెచ్చుకుని ఆయన కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ వీడ్కోలు కార్యక్రమానికి కొత్త డీజీపీ శివధర్ రెడ్డి, పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ఆదిత్య వింటేజ్ నిర్మాణాలపై ఎంపీ రఘునందన్ ఫైర్



హైదరాబాద్, సెప్టెంబర్ 30: నర్సింగ్ పోలీస్ స్టేషన్ ఎదురుగా సర్వీస్ రోడ్డును మింగి ఆదిత్య వింటేజ్ భారీ భవనం నిర్మిస్తున్నారని ఎంపీ రఘునందన్ రావు ఫైర్ అయ్యారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... అడ్డగోలుగా ఆదిత్య వింటేజ్ నిర్మాణాలు చేపడుతున్నారని.. సర్వీస్ రోడ్డు లేకుండా నిర్మాణం చేస్తుంటే ఎలా అనుమతి వచ్చిందని ప్రశ్నించారు. ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణం జరుగుతోం దన్నారు. ఎవరి ప్రమేయంతో ఈ నిర్మాణాలు చేస్తున్నారని నిలదీశారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాస్తున్నట్లు తెలిపారు. అలాగే హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు కాపీ పంపుతానని ఎంపీ చెప్పారు. పేదోడి ఇండ్లను అడ్డగోలుగా కూలగొడుతున్నారని... పెద్దలకు ఎలా అనుమతులు ఇస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి కి చిత్త శుద్ధి ఉంటే ఈ నిర్మాణాన్ని ఆపాలన్నారు. నిర్మాణం ఆప కపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు. హెచ్ఎమ్‌డీఏ అధికారులే కేసులు వేస్తారని.. మళ్లీ వారే అనుమతి ఇస్తారని విమర్శించారు. ఈ నిర్మాణ అనుమతులలో సీఎం రేవంత్ రెడ్డి ఇన్వాల్వ్ అయ్యారా.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇన్వాల్వ్ అయ్యారా అని ప్రశ్నించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, హద్దులు తొలగించారని క్రిమినల్ కేసులు నమోదు చేశారని.. ఈ నిర్మాణంలో సూట్ కేసులు అందుకుంటున్న మంత్రులు ఎవరో సీఎం రేవంత్ రెడ్డి విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. 'టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ నీతి వాఖ్యలు చెబుతుంటారు.. అందుకే ఆయనకు చెబుతున్నాను.. మంత్రుల మీద చర్యలు తీసుకోమని ఏఐసీసీకి లేఖ రాయండి' అంటూ హితవుపలికారు. వంద శాతం అవినీతి జరిగిందని.. అక్రమ నిర్మాణం జరిగిందని ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు.

## హామీలు నెరవేరిస్తే బాకీ పడినట్లా.. బీఆర్ఎస్‌పై మహేష్ గౌడ్ ఫైర్



హైదరాబాద్, సెప్టెంబరు 30 : జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలో తామే గెలుస్తామని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలో మంచి మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి గెలుస్తారని జోస్యం చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 85 శాతం తామే గెలుస్తామ ని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని మాజీ సీఎం కేసీఆర్ అప్పుల పాల్జేశారని ఆరోపించారు. కేసీఆర్ చేసిన బాకీలను తమ ప్రభుత్వం కడుతోందని చెప్పుకొచ్చారు. మిగులు తెలంగాణ రాష్ట్రాన్ని బాకీ రాష్ట్రంగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతోందని ఎద్దేవా చేశారు. ఇవాళ(మంగళవారం) గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు మహేష్ కుమార్ గౌడ్. బాకీ కార్డు అని బీఆర్ఎస్ నాయకులు అంటుంటే జనాలు నవ్వుతున్నారని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం బాకీ పడినట్లా..? అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు నెరవేరిస్తే బాకీ పడినట్లా..? అని నిలదీశారు.

తెలంగాణ ప్రజల ఆత్మహత్యలకు కారణం కేసీఆర్ ప్రభుత్వమేనని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు డ్రామాలు చేస్తే ప్రజలు తిరుగబడతారని హెచ్చరించారు. బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీలు కలిసి పదేళ్లు కాపురం చేశారని ఆక్షేపించారు. ఇప్పటికీ బీఆర్ఎస్, బీజేపీ కలిసే ఉన్నాయని విమర్శించారు. పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు.. ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో వారే చెప్పాలని మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నల వర్షం కురిపించారు.

**ఎంపీ ఈటల రాజేందర్‌కి మహేష్ గౌడ్ కౌంటర్...** బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కి టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. జీవితాంతం బీసీల పేర్లతో ఓట్లు అడిగిన వారు ఇప్పుడు ఎందుకు నోరు తెరవడం లేదని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల పెంపు ఎక్కడ ఆగిందో ఈటల రాజేందర్ చెప్పాలని నిలదీశారు. ఈటల రాజేందర్ తాను ముదిరాజ్ బిడ్డనని అంటారని.. ఇప్పుడు బీసీల కోసం ఎందుకు మాట్లాడటం లేదని ఫైర్ అయ్యారు. బీసీల నోటి దగ్గర ముద్ద లాక్కుంటున్నా ఈటల, బండి సంజయ్ ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కలిసి కోర్టులో పిల్స్ వేస్తున్నారని మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఎవరిని మోసం చేయడం కోసం ఎన్నికల షెడ్యూల్: ఎంపీ ఈటల రాజేందర్



కమలాపూర్: ఎవరిని మోసం చేయడం కోసం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. కోర్టులో చెల్లదని తెలిసికూడా బీసీలకు 42శాతం రిజర్వేషన్ ప్రకటించి.. గందరగోళానికి గురి చేస్తున్నారని విమర్శించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కమలాపూర్‌లోని ఆయన నివాసంలో భాజపా శ్రేణులతో ఈటల సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. బిహార్, మహారాష్ట్రలో రిజర్వేషన్లపై నమోదైన పలు కేసులను సుప్రీం కోర్టు కొట్టివేసిందన్నారు. "ఎవరూ కోర్టుకు వెళ్లొద్దని ముగ్గురు మంత్రులు చెబుతున్నారు. కోర్టుకు వెళ్తే అభ్యంతరం ఏంటని నేను ప్రశ్నిస్తున్నా. ఎన్నికల్లో ఓటు కోసం డబ్బులు ఖర్చుపెట్టొద్దని రాష్ట్ర ఎన్నికల కమిషన్ చెబుతోంది. నల్గొండ జిల్లాలోని గిరిజన తండాల్లో బీసీలు లేకున్నా.. రిజర్వేషన్ ప్రకటించారు. మా పార్టీ తరఫున శాసనసభలో, కౌన్సిల్‌లో పూర్తి మద్దతిచ్చాం. అనుభవం లేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొంది. మా మీద అనవసరంగా బురద చల్లొద్దు" అని ఈటల అన్నారు.

## ఫోన్ ట్యాపింగ్‌పై చర్యలు.. వీసీ సజ్జనార్ కీలక వ్యాఖ్యలు




హైదరాబాద్ : ఫోన్ ట్యాపింగ్ కేసుపై రివ్యూ చేస్తామని.. అనంతరం చర్యలపై ఆలోచిస్తామని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ వ్యాఖ్యానించారు. ప్రజల సురక్షితం జీవనానికి పీపుల్ వెల్ఫేర్ పోలీస్ విధానాన్ని తీసుకు వస్తున్నామని పేర్కొన్నారు. సీపీగా కొత్త సంస్కరణలు తీసుకురావడానికి తన వంతు కృషి చేస్తానని ఉద్ఘాటించారు. ఇవాళ(మంగళవారం) హైదరాబాద్ సీపీగా వీసీ సజ్జనార్ బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం వీసీ సజ్జనార్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. హైదరాబాద్ సీపీగా తాను చార్జ్ తీసుకున్నానని.. తనకు అవకాశం కల్పించిన తెలంగాణ ప్రభుత్వానికీ ధన్యవాదాలు తెలిపారు వీసీ సజ్జనార్.




## మద్యం, మాంసం ప్రియులకు షాకింగ్ న్యూస్...

హైదరాబాద్, సెప్టెంబరు30 : మద్యం, మాంసం ప్రియులకు షాకింగ్ న్యూస్. అక్టోబర్ 2వ తేదీన మాంసం దుకాణాలు బంద్ చేస్తున్నట్లు ప్రకటించారు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా మాంసం దుకాణాలు, స్లాటర్ హౌస్‌లను జీహెచ్ఎంసీ పరిధిలో మూసివేయాలని కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశించారు. ఈ మేరకు కమిషనర్ ఓ ప్రకటన విడుదల చేశారు. మహాత్మా గాంధీ జయంతికి మాంసం దుకాణాలు బంద్ చేయాలని జీహెచ్ఎంసీ యాక్ట్ 1955లోని 533%దీ% ప్రకారం స్టాండింగ్ కమిటీలో ఆమోదించారని గుర్తుచేశారు. సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులు పర్యవేక్షణ చేపట్టి సరైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈసారి గాంధీ జయంతి రోజునే దసరా రావడంతో అయోమయంలో పడ్డారు మాంసం విక్రయదారులు.

**మద్యం షాపులు బంద్..** మరోవైపు.. అక్టోబర్ 2వ తేదీ మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా తెలంగాణ వ్యాప్తంగా కూడా మాంసం షాపులతో పాటు మద్యం షాపులను కూడా మూసివేస్తున్నట్లు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రతి ఏడాది మహాత్మా గాంధీ జయంతికి తెలంగాణ వ్యాప్తంగా ఈ రూల్‌ను పాటిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ ఏడాది మహాత్మా గాంధీ జయంతి, దసరా పండుగలు ఒకే రోజు వచ్చాయి. ఈ క్రమంలో మద్యం షాపులను ప్రభుత్వం మూసివేస్తూ నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో దసరాను ఘనంగా చేసుకుంటారు. అయితే, ప్రభుత్వ నిర్ణయంపై ఏం చేయాలా అనే ఆలోచనలో మద్యం, మాంసం ప్రియులు ఉన్నారు.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com